పార్టీ కోసం పనిచేసిన ప్రతి వ్యక్తికి అవకాశాలు వస్తాయి




5లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

ఎయిర్‌పోర్టుల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ చేసే.. టర్కీ కంపెనీ క్లియరెన్స్ రద్దు



2లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 138 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 16 మే 2025



## సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

- కాళేశ్వరం వద్ద సిఎం, మంత్రుల పుణ్యస్నానం
- సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

**కాళేశ్వరం,మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి లతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. గోదావరి, వివరాలు 2లో

# కంచె గచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరించండి

- యధాతథ స్థితి కొనసాగించకుంటే జైలుకెళ్లక తప్పదు
- భూములపై మరోమారు విచారించిన సుప్రీం
- విచారణ జూలై 18కి వాయిదా వేసిన ధర్మాసనం



**న్యూఢిల్లీ,15(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది. కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల వివరాలు 2లో



## అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

- ఆ భయంతోనే కులగణనకు మోడీ అంగీకారం
- బీహార్పర్యటనలో రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ,మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో అణ గారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోదీ కులగణనకు అంగీకరించారని వివరాలు 2లో

## కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు

- ముందు వెళ్లి క్షమాపణలు చెప్పండి
- మధ్యప్రదేశ్ మంత్రికి సుప్రీం ఆదేశాలు



**న్యూఢిల్లీ,మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసినం దుకు ముందుగా క్షమాపణలు చెప్పాలని మధ్యప్రదేశ్ మంత్రిని సుప్రీం ఆదేశించింది. ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పండి. ఇలాంటి అంశాల్లో కాస్త సున్నితంగా వ్యవహరించండని ఆగ్రహం వ్యక్తంచేసింది. పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. హైకోర్టు ఆదేశాల మేరకు ఆయనపై కేసు కూడా నమోదైంది. ప్రస్తుతం ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. హైకోర్టు ఆదేశాలపై ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిం చారు. మంత్రి పిటిషన్‌ను శుక్రవారం విచారించేందుకు కోర్టు అంగీకరించింది. అంతేగాకుండా వివరాలు 2లో

## 8వేల కోట్ల ఫీజు బకాయిలు

- తక్షణమే చెల్లించి ఆదుకోండి
- సిఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ



**హైదరాబాద్,15(పిసిడబ్ల్యూ న్యూస్):** తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ. 8వేల కోట్ల బకాయిలు పేరుకు పోయాయి. బకాయిలు చెల్లించక పోవడంతో ప్రైవేటు- కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీ రింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీ లు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను ప్రభుత్వమే విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 8,000 కోట్ల ఫీజు బకాయిలు పేరుకు పోయాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. బండి సంజయ్ పేర్కొన్న వివరాల ప్రకారం, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల వివరాలు 2లో

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రేవంత్ రెడ్డి తన తప్పు ఒప్పుకోవాలి : కేటీఆర్



**హైదరాబాద్,15(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచ గచ్చిబౌలి భూ ముల వ్యవహారంలో రేవంత్ రెడ్డి తన తప్పు ఒప్పుకోవాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. ప్రభుత్వం తరఫున వాదిస్తున్న అడ్వకేట్‌ను సుప్రీంకోర్టు హెచ్చరిం చింది. కంచ గచ్చిబౌలి అడవుల విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు అధికారులను జైలుకు పంపించాలా అంటూ హెచ్చరించింది. రేవంత్ రెడ్డి చేసిన తప్పులకు తెలంగాణ ప్రభుత్వ అధికారులు శిక్ష ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ అధికారులకు సుప్రీంకోర్టు హెచ్చరికలు జారీ చేసింది. రేవంత్ రెడ్డి మూర?త్వం వల్ల అధికా రులు జైలుకు వెళ్లాల్సి వస్తుంది. వీటన్నింటికీ తాను బాధ్యుడిని కాదని రేవంత్ రెడ్డి తప్పించుకునే అవకాశం లేదు అని కేటీఆర్ పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై, కంచె గచ్చిబౌలి వివరాలు 2లో



## యాదాద్రిని దర్శించుకున్న సుందరాంగులు

- పోచంపల్లిలోనూ ఇక్కత్ చీరలపై మక్కువ

**యాదగిరిగుట్ట,15(పిసిడబ్ల్యూ న్యూస్):** మిస్‌వరల్డ్ పోటీ కోసం హైదరాబాద్ చేరుకున్న అందగత్తెలు వివిధ ప్రాంతాలను సందర్శిస్తున్నారు. గురువారం సాయంత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించు కున్నారు. ఆలయ గెస్ట్‌హౌస్ నుంచి బ్యాటరీ వాహనాల్లో చేరుకున్న సుందరీమణులు అఖండ దీపారాధన మండపంలో వివరాలు 2లో

## అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా..?

- కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు
- సబితమ్మకు ఇప్పుడు తెలంగాణ గుర్తుకు వచ్చిందా
- మండిపడ్డ మంత్రి సీతక్క



**ములుగు,మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** మిస్ వరల్డ్ కంటేస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటనను వివాదాస్పదం చేస్తున్నారని బిఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం బిఆర్ఎస్‌కు పరిపాటిగా మారిందని అంటూ ఫైర్ అయ్యారు. ప్రతి చిన్న విషయానికి తెలంగాణ సెంటిమెంటును రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని మంత్రి సీతక్క వివరాలు 2లో

## 8వేల కోట్ల ఫీజు బకాయిలు

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధ్యాపకులకు జీతాలు, సిబ్బందికి భత్యాలు, కాలేజీల నిర్వహణ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీ రింగ్ కళాశాలలు మూతపడటం ప్రారం భించాయని బండి సంజయ్ హెచ్చరించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించనిదే సర్టిఫికెట్లు- ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల మధ్య వాగ్వాదాలు తీవ్రమై పోలీస్ స్టేషన్ల దాకా కేసులు వెళుతున్నాయని అన్నారు.అసెంబ్లీ సాక్షిగా ఫీజు బకాయిలను వన్ టైం సెటిల్ మెంట్ చేయాలని ఒకసారి, మరోసారి 12 వాయిదాల్లో చెల్లిస్తామని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటలను విస్మరించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుండే బకాయిలను నిర్ణీత వ్యవధిలో చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బండి సంజయ్ ప్రభుత్వానికి హితవు పలుకుతూ, విద్యార్థుల భవిష్యత్తును, కళాశాలల మనుగడను దృష్టిలో పెట్టు-కుని తక్షణమే బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగంపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వం లక్షలాది మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక క్షోభ కలిగిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రేవంత్ రెడ్డి తన తప్పు ఒప్పుకోవాలి : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారంలో చేసిన తప్పులను ఒప్పుకోవాలి. వందల బుల్డోజర్లతో ధ్వంసం చేసిన కంచె గచ్చిబౌలి అడవులను తిరిగి పునరుద్ధరించాలి. లేకుంటే రేవంత్ రెడ్డికి కోర్టు శిక్షలు తప్పవు. కంచె గచ్చిబౌలి భూములను అమ్మి పది వేల కోట్ల రూపాయల స్కాం చేయడం ముమ్మాటికి అవినీతి, నమ్మక ద్రోహమే. సెలవు దినాల్లో బుల్డోజర్లను పంపి అడవులను ధ్వంసం చేయడం ముమ్మాటికి పర్యావరణ చట్టాల ఉల్లంఘనే. రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్య చర్యల ఫలితంగా పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగింది. కంచె గచ్చిబౌలి భూములను ప్రభుత్వం కాపాడాల్సిందే. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తాను సృష్టిం చిన విధ్వంసానికి, తన బాధ్యతారాహిత్యానికి, చేసిన పది వేల కోట్ల స్కాంకు బాధ్యత వహించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## యాదాద్రిని దర్శించుకున్న సుందరాంగులు

(మొదటి పేజీ తరువాయి)

జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు. అక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతను పర్యవేక్షించారు. టూరిజం విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పోచంపల్లిని ఆఫ్రికా ఖండానికి చెందిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. వారికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇక్కత్ చీరల ప్రత్యేకత, తయారీ విధానాన్ని విదేశీ అతిథులు పరిశీలించారు. పలువురు భామలు స్వయంగా చీరలను నేసి సంబరపడ్డారు.

## నాంపల్లి వద్ద రౌడీషీటర్ దారుణ హత్య

**హైదరాబాద్,మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని నాంపల్లిలో దారుణం చోటు-చేసుకుంది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రౌడీషీటర్ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. చాంద్రాయణగుట్టకు చెందిన అయాన్ ఖురేషీ ఓ కేసు నిమిత్తం నాంపల్లి కోర్టుకు వచ్చాడు. అనంతరం తిరిగి వెళుండగా ఐదుగురు దుండగులు ఆయన్ను వెంబడించారు. క్యాన్సర్ ఆస్పత్రి వద్ద తొలుత బ్యాట్‌తో దాడి చేశారు. అనంతరం కత్తులతో గొంతు కోసి పొట్టలో పొడిచి చంపారు. హత్యకు ఉపయోగించిన బ్యాట్, కత్తులను ఘటనాస్థలంలోనే వదిలి పరారయ్యారు. సమాచారం అందుకున్న నాంపల్లి పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. స్థానికులు బయాందోళనలకు గురయ్యారు.

## సౌదీలో తెలంగాణ వాసి అనుమానాస్పద మృతి

**సూర్యాపేట,మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** సౌదీ అరేబియాలో కోదాడకు చెందిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షేక్ తాజుద్దీన్ సౌదీలో పదేళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 8న కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని సౌదీ పోలీసులు ఆలస్యంగా తాజుద్దీన్ కుటు-ంబసభ్యులకు తెలియజేశారు. సౌదీలో కపిల్ అనే వ్యక్తితో తాజుద్దీన్‌కు కొద్ది రోజులుగా గొడవలున్నాయని, అతడే కాల్చి చంపి ఉంటాడని కుటు-ంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని కోదాడకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సాయం చేయాలని కోరుతున్నారు.

## సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదల య్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. దీంతో గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాళ్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు- సరస్వతీ నది పుష్కరాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు- పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు- చేశారు.

## కంచె గచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరించండి

(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు- తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. హెచ్‌సీయూలో 120 ఎకరాల్లో చెట్ల కూల్చివేత విధ్వంసంపై సుప్రీం కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని మే 15 వరకు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కోర్టు విచారణ జరిపింది. హెచ్‌సీయూలో విధ్వంసానికి సంబంధించిన వివరాలన్నింటిని పరిశీలించడానికి ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ- హెచ్‌సీయూ విధ్వంసాన్ని పరిశీలించింది. అక్కడి విద్యార్థి సంఘాల నాయకుల అభిప్రాయాలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ నాయకుల ఒపీనియన్స్ సైతం సేకరించింది. కాగా, అక్కడ జరిగింది విధ్వంసమే.. చెట్లు-, జంతువులకు తీవ్ర నష్టం వాటిల్లిందని నివేదికను ఏప్రిల్ 15న కమిటీ- సుప్రీం కోర్టుకు సమర్పించింది. అదే రోజు ప్రభుత్వం సైతం నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో మే 15 వరకు మీరు హెచ్‌సీయూ అడవుల్లో కూల్చిన చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని కోర్టు ప్రశ్నించింది. గతంలో విచారణ సమయంలోనూ తెలంగాణ ప్రభుత్వం సరైన నివేదిక ఇవ్వాలని.. అలా ఇవ్వకపోతే సీఎస్‌ను జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించిన విషయం విధితమే. చెట్లను నాటడానికి ఏ విధమైన పద్ధతులను అనుసరిస్తారో చెప్పాలంటూ సూచించింది. ప్రభుత్వం, సీఎస్‌ను ఎవరినీ కూడా ఉపేక్షించబోమని హెచ్చరించింది.

## అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరపున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ- విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేవలం 5శాతం మంది ప్రజల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు ఈ ప్రభుత్వంలో స్థానం లేదని, కార్పొరేట్ వ్యక్తులకే మోదీ గవర్నమెంట్ వత్తాసు పలుకుతోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో చేపట్టిన విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ప్రైవేటు- కళాశాలలు, యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడలు వంచైనా వీటిని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బిహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన 'శిక్షా న్యాయ్ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథిలా యూనివర్సిటీ- ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు. యూనివర్సిటీ-గేటు- బయటే నా కారును నిలిపివేశారు. అయినా, నేను వెనకడుగు వేయలేదు. నడుచుకుంటూ సభా వేదిక మీదికి చేరుకున్నాను. బిహార్ ప్రభుత్వం నన్ను ఎందుకు ఆపలేకపోయిందో తెలుసా? మీ అందరి అభిమానమే నన్ను ముందుకు నడిపించింది. ఇదే శక్తి నరేంద్ర మోదీని గద్దె దించుతుంది. ప్రతిపక్షాల డిమాండ్ మేరకే కులగణను మోదీ అంగీకరించారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసని రాహుల్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కాకుండా...అంబానీ, అదానీల కోసమే పని చేస్తోందని రాహుల్ విమర్శించారు.

## కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన తీరును తప్పుపట్టింది. ఎలాంటి మాటలు మాట్లాడుతున్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలను వెల్లడించిన కర్నల్ ఖురేషీని ఉద్దేశిస్తూ ఆమెను 'ఉగ్రవాదుల సోదరి' అని విజయ్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇదికాస్త తీవ్ర దుమారం రేగడంతో మంత్రి వ్యాఖ్యలను హైకోర్టు బుధవారం సుమోటోగా తీసుకుంది. శత్రుత్వం, విద్వేషాన్ని ప్రోత్సహించినందుకు ఆయనపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని జస్టిస్ అతుల్ శ్రీధరణ్, జస్టిస్ అనురాధా శుక్లాలతో కూడిన ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి తమకు నివేదించాలని రాష్ట్ర డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ... దేశంలో ఇంకా సమగ్రత, క్రమశిక్షణ, త్యాగం, నిస్వార్థం, గౌరవం, అజేయమైన ధైర్యం నిండి ఉన్న సంస్థ ఒక్క సైన్యం మాత్రమేనని పేర్కొన్నారు. అటు జాతీయ మహిళా కమిషన్ కూడా మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న మహిళలపై ఇటు-వంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది. మంత్రి చేసిన వ్యాఖ్యలపై భాజపా సీనియర్ నాయకుడు ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ స్పందించారు. విజయ్ షాను 'మూర్ఖుడు' అని ఆయన సంబోధించారు. మరోవైపు విజయ్ షాపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రధాని మోదీని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది.

## అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా..?

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. ఈ సందర్భంగా నిన్న మిస్ వరల్డ్ కాంటెస్ట్ వరంగల్ వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు- చేసిన ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. హెరిటేజ్ వాక్ సక్సస్ కావడంతో బిఆర్ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకున్నారని, కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని సె-టైర్లు వేశారు. ఇవంకా ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకుడు.. ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గుళ్లలోకి కాళ్ళు కడుక్కొని వెళ్ళడం గిరిజన సంప్రదాయం.. అదే అక్కడ పాటించారు. అందులో ఒక ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్ళకు నీళ్ళు పోసింది. దానిని పట్టు-కొని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బద్నాం చేస్తున్నారని, నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం కాళ్ళు కడిగితే అందరి కాళ్ళు కడిగించాలి కదా..? దానిని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? కవితమ్మ కాళ్ళ దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకోవడం మీ దురహంకారం కదా.. దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా..? అంటూ నిప్పులు చెరిగారు. ఈమధ్య సబితా ఇంద్ర రెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసని.. అబద్ధాలు కాకుండా వాస్తవాలు మాట్లాడితే బాగుంటు-ందని సూచించారు. అబద్దాలకు అంబాసిడర్ గా సబితమ్మ మారకూడదన్నారు. అధికారం పోయాక.. ప్రజలు, ఆత్మగౌరవం మీకు గుర్తుకు వచ్చిందా..? అని ప్రశ్నించారు.

## క్యాన్సర్‌తో మృతిచెందిన కుటుంబానికి బాసట

- రూ.7లక్షల ఆర్థిక సాయం అందించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, 15(పిసిడబ్ల్యూ న్యూస్):** అల్లారుముద్దుగా పెంచుకున్న పాప ఒక్కసారిగా అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రికి తీసుకెళితే బ్లడ్ క్యాన్సర్ అని పరీక్షల్లో తేలింది. పాపను రక్షించుకునేందుకు తల్లిదండ్రులు రూ.లక్షలు వెచ్చించారు. విషయం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో పాప చికిత్సకు రూ. 8 లక్షలు మంజూరు చేశారు. వ్యాధి ముదరడంతో పాప ప్రాణాలు కోల్పోయింది. ఆమె చికిత్సకు గతంలో చేసిన వ్యయానికి సంబంధించి మరో రూ.7 లక్షలను సీఎంఆర్ఎఫ్ నుంచి విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో అధికారులు ఆ మొత్తాన్ని విడుదల చేశారు. హైదరాబాద్ ఎల్బీ నగర్‌కు చెందిన రఘు, మంజుల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె వేదవల్లికి (5) 2022లో తీవ్ర జ్వరం రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు బ్లడ్ క్యాన్సర్ అని తేల్చారు. పాపను రక్షించుకునేందుకు రెండేళ్ల పాటు తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. చికిత్స వ్యయం నానాటికీ భారమవడంతో 2024లో ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో వేదవల్లి చికిత్సకు అవసరమైన రూ.8 లక్షలను మంజూరు చేశారు. చికిత్స అందించినప్పటికీ అప్పటికే వ్యాధి తీవ్రత పెరగడంతో గతేడాది చివరలో వేదవల్లి మరణించింది. ఆమె చికిత్సకు గతంలో ఆ కుటుంబం పెద్ద మొత్తంలో ఖర్చు చేసింది. దీంతో ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.7 లక్షలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు మంజూరు చేసిన రూ.7 లక్షల చెక్కును సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు వేదవల్లి తండ్రి రఘుకు గురువారం సచివాలయంలో అందజేశారు.

## వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్

- ముంబై, హైదరాబాద్‌లలో ఇడి సోదాలు
- భారీగా నగదు, ఆభరణాలు స్వాధీనం

**హైదరాబాద్,మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు కలకలం సృష్టించాయి. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్‌లో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పోరేషన్ స్కామ్‌లో భాగంగా ఈడీ అధికారులు.. ముంబై, హైదరాబాద్‌తో పాటు 12 ప్రాంతాల్లో గురువారం సోదాలు నిర్వహించారు. ముంబైలో టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ- డైరెక్టర్‌గా పనిచేస్తున్న వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు తనిఖీలు చేసి.. భారీగా నగదును గుర్తించినట్లు సమాచారం. మొత్తం రూ.9 కోట్లకు పైగా నగదుతో పాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా గురువారం ముంబయి, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది. ముంబయిలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు- స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు 2009 నుంచి అనుమతులు ఇచ్చారు. ఈ కేసులో సీతారాం గుప్తా, అరుణ్ గుప్తా కీలక నిందితులుగా ఉన్నారు. నిందితులు అధికారులతో కలిసి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రజలకు విక్రయించినట్టు- దర్యాప్తులో తేలింది. ఇందులో భాగంగా వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ- డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. సోదాల్లో నిందితుల ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది.

## ఎయిర్‌పోర్టుల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ చేసే.. టర్కీ కంపెనీ క్లియరెన్స్ రద్దు



**న్యూఢిల్లీ,మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడంతోపాటు డ్రోన్లు, ఆయుధాలు సరఫరా చేసిన టర్కీపై భారత్ కఠిన చర్యలు చేపడుతున్నది. దేశంలోని పలు విమానాశ్రయాల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు అందించే టర్కీ సంస్థ సెలెబి ఏవియేషన్ సెక్యూరిటీ క్లియరెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది.బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ భద్రత దృష్ట్యా, సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భద్రతా అనుమతిని రద్దు చేసినట్లు అందులో పేర్కొంది.కాగా, టర్కీకి చెందిన సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ సంస్థకు గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఏజెన్సీ కేటగిరీ కింద 2022 నవంబర్ 21 అనుమతి లభించింది. ఢిల్లీ, ముంబై, చెన్నైతో సహా తొమ్మిది ప్రధాన విమానాశ్రయాలలో కీలకమైన హై సెక్యూరిటీ కార్యకలాపాలకు సెలెబి ఏవియేషన్ బాధ్యత వహిస్తున్నది. గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో సర్వీసెస్, ఎయిర్‌సైడ్ ఆపరేషన్స్ వంటి కీలక విధులను ఈ కంపెనీ నిర్వహిస్తున్నది. ఈ కార్యకలాపాలన్నీ జాతీయ భద్రతతో ముడిపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో టర్కీకి చెందిన సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ సంస్థ సెక్యూరిటీ క్లియరెన్స్‌ను భారత్ రద్దు చేసింది.

# పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..

- **2017కు ముందు నుండి పార్టీ మారకుండా కాంగ్రెస్‌లో కష్టపడ్డ వారికే జిల్లా, బ్లాక్, మండల, డివిజన్, గ్రామ అధ్యక్ష పదవులు**
- **వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు**






**హనుమకొండ, మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** పార్టీ సిద్ధాంతం కోసం, పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉండి, కంటికి రెప్పలా కాపాడుకుంటానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం వర్ధన్నపేట టౌన్ లోని ఏ బి ఎస్ గార్డెన్స్ నందు వర్ధన్నపేట టౌన్, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల 3, 14, 43, డివిజన్ల నాయకలతో వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీ–పీసీసీ అబ్జర్వర్ అమర్ అలీ ఖాన్, మేడి రవిచంద్ర, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ప్రజల రుణం కార్యకర్తల కష్టాన్ని మర్చిపోను అని,కష్టపడ్డ ప్రతి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. నియోజకవర్గంలో రాబోయే కాంగ్రెస్ పార్టీ కమిటీ కమిట్మెంట్ తో పనిచేసే నాయకత్వాన్ని ప్రోత్సహించండి అని,కాంగ్రెస్ పార్టీయే నా గ్రూపు అని తెలిపారు.సమర్థ నాయకత్వం ద్వారానే పార్టీ బలోపేతం అవుతుందని, ప్రజలకు కార్యకర్తలకు సేవ చేసే నాయకత్వాన్ని ఎంపిక చేయండి అని అన్నారు.కాంగ్రెస్ పార్టీలో పదవైన, ప్రజా ప్రతినిధి పదవి అయినా పార్టీకి ప్రజలకు సేవ చేయాలని, బాధ్యత గా నిర్వహించే నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రూపులు పెట్టవద్దు అని, కష్టపడ్డా కార్యకర్తకు పార్టీ గుర్తింపు లభిస్తుందని అన్నారు. 2017కు ముందు నుండి పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీ లో కష్టపడ్డ వారికి బ్లాక్ అద్యక్షులు, మండల, వార్డు,గ్రామ అధ్యక్షులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు జిల్లా, బ్లాక్, మండల, డివి జన్ వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# దేవరుప్పులలో నిర్వహించిన సంస్థాగత సన్నాహక సమావేశం

- **మండుటెండలో మేము సైతం అంటున్న ప్రజలు**
- **విశేష ప్రజాధరణ పొందటం విశేషం**
- **ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝూన్సీ రెడ్డిలపై ఉరకలెత్తుతున్న ఓటర్ల అభిమానం**






**తొర్రూరు ప్రతినిధి, మే 15(పీసీడబ్ల్యు న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, మరియు నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి లు దేవరుప్పుల మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్లో నిర్వహించిన సంస్థాగత సన్నాహక సమావేశంలో గురువారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా, దేవరుప్పుల మండలంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి లకు ఘనస్వాగతం పలికారు. ర్యాలీలో మహిళలు, యువత, పెద్ద ఎత్తున, పాల్గొని నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహంగా తీర్చిదిద్దారు. ఈ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రసంగిస్తూ బూతు స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ జెండా పట్టి పార్టీని గెలిపించే వారే నిజమైన కాంగ్రెస్ వాది, ప్రజలే మా బలం. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరు భాగస్వాములుగా ముందుకు రావాలి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పెంచడమే మా లక్ష్యం. దేవరుప్పుల మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాం. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తే, వచ్చే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించగలం.. ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ప్రసంగిస్తూ ప్రజల రుణం కార్యకర్తల కష్టాన్ని ఎన్నటికీ మర్చిపోము. కష్టపడ్డ ప్రతి కార్యకర్తని కంటికి రెప్పలా కప్పుడుకుంటాం. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలి. దేవరుప్పుల మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపే ఒదుకు అన్నివిధాలా కృషి చేస్తాం. ప్రభుత్వం ద్వారా లభిస్తున్న అవకాశాలను ప్రతి గ్రామానికి చేర్చడం మా లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల, జిల్లా స్థాయి, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళ నాయకులు, కోఆర్డినెటర్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై, తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సంఘీభావంతో కూడిన ఈ కార్యక్రమం స్థానికంగా మంచి చర్చనీయాంశమైంది..

# సీబీఎస్ 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు 'మోషన్" కాలేజీలో ఉచిత విద్య

- **మెరిట్ సాధించిన పేద విద్యార్థులను ప్రోత్సహించడమే మోషన్ కాలేజ్ లక్ష్యం**
- **మోషన్ కాలేజ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్**



**హనుమకొండ, మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల ప్రకటించిన సిబిఎస్ పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మంచి సువర్ణవకాశం. ఐఐటి, మెడికల్ కోచింగ్ కు దేశంలోనే అగ్రగామి విద్యా సంస్థ అయినా కోటా రాజస్థాన్ మోషన్ ఐఐటి–జేఈఈ, నీట్ జూనియర్ కళాశాల హన్మకొండ నందు విద్యార్థులు అడ్మిషన్ పొంది, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విద్యార్థినీ, విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐఐటి, మెడికల్ సీట్లను సాధించడమే లక్ష్యంగా హన్మకొండలోని నయీంనగర్ లో కోటా రాజస్థాన్ నుండి ఏర్పడ్డ మోషన్ కాలేజీలో నిష్ణాతులైన అధ్యాపక బృందంతో విద్యార్థినీ, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన జరుగుతుందన్నారు. అదే విధంగా సిబిఎస్ 10వ తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడమే మోషన్ కాలేజీ లక్ష్యమన్నారు. 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మోషన్ కాలేజీలో ఉచితంగా అడ్మిషన్ ఇస్తామని తెలిపారు. 10వ తరగతిలో 500 మార్కులకు గాను 470 మార్కుల పైన సాధించిన విద్యార్థులకు 100% శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ, 450 మార్కులు పైన వచ్చిన విద్యార్థులకు 50% శాతం ఫీజులో రాయితీ ఉంటుందని, 400 పైన మార్కులు వచ్చిన విద్యార్థులకు 25% శాతం ఫీజులో రాయితీ ఉంటుందని మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విద్యార్థినీ, విద్యార్థులకు సూచించారు. ఇతర వివరాల కోసం 9963417910 నెంబర్ కు సంప్రదించగలరు.



# యువ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన 47వ డివిజన్ నాయకులు

**హనుమకొండ, మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యువ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలను 47 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి పసునూరి మనోహర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొడ్డు దేవయ్య, మేకల మల్లికార్జున్ రామగిరి శ్రీనివాస్, కొండ్ర తిరుపతి, వనపాకల రాజేందర్ ,గాదె సామేలు, మచ్చ బాబురావు, నదునూరి హరిప్రసాద్, నదునూరి జానకిరామ్, మేకల హరికృష్ణ , అడ్వకేట్ విక్రమ్‌లు విష్ణువర్ధన్ రెడ్డి ని శాలువాతో, పూల ఒకే ఇచ్చి సత్కరిస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఇలాంటి పుట్టినరోజులు ఇంకా అనేకం జరుపుకొని ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, ప్రజా సేవలో ముందుండి భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా ఉండాలని పసునూరి మనోహర్, నేతలు ఆకాంక్షించారు.





## ఎమ్మెల్సీ కవితను కలిసిన జిల్లా నాయకులు బస్కే రాజేందర్

**హనుమకొండ, మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కలవకుండా కవితను హైదరాబాద్ బంజారాహిల్స్ లోని వారి నివాసంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు, ఉద్యమ నేత బస్కే రాజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు నియంత్రణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి...



**కరీంనగర్ టౌన్, మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని పీ.డీ.ఎస్.యు రాష్ట్ర నేతలు కాంపాటి పృథ్వీ, అనిల్ సాయిబోలా ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కరీంనగర్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఫీజు నియంత్రణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయకపోతే పేదలకు నాణ్యమైన విద్య దూరమవుతుందని విమర్శించారు.

## ఘనంగా అంజన్ కుమార్ జన్మదిన వేడుకలు...



**కరీంనగర్ జిల్లా, మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ జన్మదినం సందర్భంగా నేడు నగరంలోని పలుచోట్ల పలువురు కాంగ్రెస్ నేతలు మరియు అంజన్ కుమార్ అభిమానులు వేడుకలను ఘనంగా నిర్వహించినారు. యూత్ కాంగ్రెస్ నాయకులు కొండ్ర హరీష్ ఆధ్వర్యంలో నగరంలోని టవర్ సర్కిల్ వద్ద జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు పొన్నం సత్యం హాజరై అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొన్నం సత్యంతో పాటు కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇమ్రాన్, కంకణాల అనిల్ కుమార్, మహమ్మద్ అహ్మద్ అలీ, బోనాల శ్రీనివాస్, వీర దేవేందర్ పటేల్, శ్రీపురం మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు ఆసిఫ్ ఆధ్వర్యంలో నాకా చౌరస్తా వద్ద కేక్ కట్ చేయడం జరిగింది.మాజీ కరీంనగర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ ఇమ్రాన్ నేతృత్వంలోని అంజన్ కుమార్ అభిమానులు రాజీవ్ చౌక్ వద్ద కేక్ కట్ చేయడం జరిగింది. ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షునిగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ నేడు పిసిసి కార్యదర్శిగా పార్టీకి సేవలందిస్తున్న వైద్యుల అంజన్ కుమార్ ముమ్ముందు మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని వారికి ఆ భగవంతుడు ఆయురారోగ్యాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నామని నేటి యువతకు మార్గదర్శకులుగా స్ఫూర్తిదాయ కులుగా ఉన్నటువంటి అంజన్ కుమార్ ఇలాంటి మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆశిస్తున్నామని నేతలు పేర్కొన్నారు.



## రాజీవ్ రహదారిపై లారీని ఢీకొన్న డీసీఎం వ్యాన్....



**పెద్దపల్లి:మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** కుందన పెల్లి వద్ద ఉన్న రాజీవ్ రహదారిపై వెళ్తున్న లారీని నిద్ర మత్తులో డీసీఎం డ్రైవర్ లారీ వెనుక భాగాన ఢీకొన్నాడు ఆ సమయంలో ఎడమ వైపు కూర్చున్న మరో వ్యక్తి అక్కడే దూకాడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.డ్రైవర్ కి తలకు గాయమైంది మరో వ్యక్తి అందులోనే ఇరుక్కుపోయాడు రెండు వాహనాల మధ్యలో క్యాబిన్లో ఇరుకున్న విషయం 108 కి తెలపగా, తక్షణమే ప్రమాదం జరిగిన చోటికి 108 వచ్చి గాయపడ్డ వాళ్లని అంబులెన్స్ టెక్నీషియన్ వైద్యం అందిస్తూ గోదావరిఖని గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకెళ్లారు. సురక్షితంగా ప్రాణప్రయస్థితి నుండి బయటపడ్డారు. ఈ సంఘటన డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే జరిగిందని తెలిపారు.

## నిరుపేద కుటుంబానికి దుబాయ్ వారధి ఆర్థిక సహాయం



**రాయికల్ మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** రాయికల్ మండల్ రామాజిపేట్ గ్రామంలో గుర్రం వెంకట నరసయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిగా ఆ విషయాన్ని తెలుసుకొని దుబాయ్ వారధి సంఘం 18500 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. వారి కుటుంబ సభ్యులు దుబాయ్ వారధి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ సర్పంచులు దశమందు వెంకటేశ్వర్లు వాసరి రవి మాజీ ఉప సర్పంచ్ ఆర్మూరి నరేందర్ దుబాయ్ వారధి సభ్యులు పల్లికొండ రాజు, గోపి, నరేష్, దుబాయ్ వారధి సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఏడవ వార్డు సమస్యలపై వినతి పత్రం అందజేత



**కోరుట్ల మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** మెట్ పల్లి పట్టణంలోని 7వ వార్డు హనుమాన్ నగర్ 3వ వీధిలో డ్రై నేజీ వ్యవస్థ పూర్తి కాలేదు.మరి యు సి.సి. రోడ్లు,మిషన్ భగీరథ పైపులు,సిమెం ట్ పైపులు తొలగిం చబడ్డాయి వాటి స్థానంలో కొత్తవి వేయాలని మెట్ పల్లి ఏడవ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అబ్దుల్ జాకీ ర్ మున్సిపల్ కమీషనర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.మున్సి పల్ కమిషనర్ త్వరలోనే సమస్య లను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ జాకీర్, ఖయ్యూం, నిసార్, ఆసిఫ్, సైఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం



**కోరుట్ల మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** మెట్ పల్లి డిపోలో డైయల్ యు వర్ డి.ఎం కార్యక్రమం మెట్ పల్లి పరిసర ప్రాంత ప్రయాణీకు లు నే డు శుక్రవారం రోజున సాయంత్రం 4.00 గంటల నుంచి 5.00 గంటల వరకు డయల్ యువర్ డి. ఎం. ఫో న్ ఇన్ కార్యక్రమం నిర్వయించబ డును.కావున మెట్ పల్లి డిపో పరి దిలో గల ప్రయాణికులందరూ ఈ సదవకాశన్ని వినియోగించుకొని ఈ కార్యక్రమంలో పాల్గొని మీ యొ క్క సమస్యలను తెలుపగలరు మ రియు డిపో అభివృద్ధి కి మీ సల హాలు,సూచనలు అందించవల సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.మీరు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్: 9959225927 సమయం: సా యంత్రం 4.00 గంటల నుంచి5.00 గంటల వరకు మాత్రమే అని డిపో మేనేజర్ టి. దేవరాజ్ తెలిపారు

## పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి 50 కోట్లు నిధులు మంజూరు చేయండి

- సీఎం రేవంత్ రెడ్డిని కోరిన పాలకుర్తి ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు



**తొర్రూరు ప్రతినిధి,మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డిలు.పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ని కోరిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పార్టీ ఇంచార్జ్ ఇంచార్జ్ ఝాన్సి రెడ్డిలు.పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని,పార్టీ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి లను ఆప్యాయంగా పలకరిస్తూ రాష్ట్రంలో ఎండలు బాగా తీవ్రంగా ఉన్నాయని మీరు ఎండను లెక్కచేయకుండా తిరుగుతున్నారు, మీ ఆరోగ్యాలు జాగ్రత్తగా చూసుకోండి అని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల జారీపై సానుకూల నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ప్రతిసారీ సమయం దొరికినప్పుడల్లా ముఖ్యమంత్రిని మరియు మంత్రులను కలిసే యశస్విని రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు తీసుకురావడంలో చురుకుగా వ్యవహరిస్తు న్నారు ప్రజల అవసరాలను ప్రభుత్వానికి చేరవేసి, పాలకుర్తికి మెరుగైన మౌలిక సదుపాయాలు తీసుకురావడంలో వారి కృషి అభినందనీయం అని సీఎం రేవంత్ రెడ్డి వారిని అభినందించారు.

## అధికారం కోసం పూటకోపార్టీ మార్చే నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి



**కురవి,మే 15 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** కేంద్రం లో అధికారం లో కొనసాగుతున్న బీజేపీ తమ పాలన సుస్థిరం చేసుకోవడానికి మత విద్వేషాలను రెచ్చగొట్ట డాన్ని ప్రతిగటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి పిలుపు నిచ్చారు. సిపిఐ కురవి మండల 9వ మహాసభలు అయ్యగారిపల్లి గ్రామం లో సిపిఐ సీనియర్ నాయకులు నల్లు అమృతా రెడ్డి అరుణ పతాకాన్ని ఎగుర వేయగా,బుర్ర సమ్మయ్య, బోల్లం ఉప్పాలయ్య అధ్యక్షతన జరిగగా విజయ సారధి మాట్లాడుతూ పూటకో పార్టీ మారుస్తూ అధికారం ఎక్కడ ఉంటే అక్కడ వాలే రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాలని, నైతిక విలువలకు కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించాలని కోరారు.సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి నూతన కార్యదర్శి గా కరణం రాజన్న,సహాయ కార్యదర్శిగా,బుర్ర సమ్మయ్య ను 21మంది తో సమితి ని ప్రకటించగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, దొంతు రామమూర్తి, బోల్లు వెంకన్న, తురక రమేష్, కలగూర నాగరాజు, నరసింగం గురువయ్యా, బస్వ కొమరయ్య, రామగొని రవి, దూది కట్ల సారయ్య, కందుల యాకయ్య,నల్లు మధుసుధన్ రెడ్డి, సాయి,మహేష్,తదితరులు పాల్గొన్నారు.

## కుంట్లంలో ప్రమాదశాత్తుగా ఎల్ టి లైన్



**మహాదేవపూర్, మే 15(పీసీడబ్ల్యూ న్యూస్) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కుంట్లం గ్రామంలో జిముడ తులసి రామ్ ఇంటి పై కప్పు ని ఆనుకోని చాలా ప్రమాదంగా విద్యుత్ ఎల్ టి లైన్ ఉంది. వేసవి కాలంలో వాడగాలుకు ప్రమాదం జరిగే అవకాశం ముందని పై భాగాన్ని ఆనుకోని ఉండటంతో బిక్కు బిక్కు మంటు జీవిస్తున్నానని ఇంటి యజమాని తులసి రామ్ చెప్తున్నాడు.ఎలాంటి ప్రమాదం జరుగముందే విద్యుత్ అధికారులు చర్య తీసుకొని ఎల్ టి లైన్ పక్కనకు మార్చగలరని కోరుతున్నాడు.

## కాంగ్రెస్ సీనియర్ నేత చంద్రమౌళి దినకర్మకు హాజరైన ఎమ్మెల్యే జీఎస్సార్, డీసీసీ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి

**భూపాలపల్లి జిల్లా,రేగొండ, మే15(పిసీడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రేగొండ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొల్లెపల్లి చంద్రమౌళి గుండెపోటుతో ఇటీవల హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. కాగా,గురువారంవారిదినకర్మ రేగొండలోని వారి స్వగృహంలో జరగ్గా, ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. చంద్రమౌళి అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి, వారి కుటుంబ సభ్యులకు తీరని లోటని అన్నారు. చంద్రమౌళి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం చేశారు. ఎమ్మెల్యే వెంట రేగొండ మండల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు



## కాలేశ్వరం పుష్కరాలకు వెళ్లేందుకు మండుటెండను చూసి జంక్తున్న భక్తులు




**తొర్రూరు ప్రతినిధి,మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):**12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే కాలేశ్వరం సరస్వతీ పుష్కరాలకు త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. కేవలం తెలంగాణ నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా కాలేశ్వరం సరస్వతి పుష్కరాలకు అనేకమంది భక్తులు తరలివస్తూ ఉంటారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని టి జి ఎస్ ఆర్ టి సి బస్ డిపోల నుండి పుష్కరాల కొరకు 700 బస్సులను సమకూర్చారు. అందులో భాగంగానే తొర్రూర్ బస్ డిపో నుండి ఐదు బస్సులను పుష్కరాల కొరకు డి ఎం పద్మావతి ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల ముందే పుష్కరాలకు వెళ్లే బస్సుల వివరాలను కూడా ప్రకటించారు. అయినప్పటికీ మొదటిరోజు గురువారం మొదటి బస్సులో అయిదుగురు భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ప్రయాణం అయ్యారు. రెండవ బస్సు కూడా ఏర్పాటు చేయగా అదే పరిస్థితి నెలకొని ఉన్నదని ఆర్టీసీ అధికారులు విన్నవించారు. కొందరు ప్రయాణికులను పుణ్య స్నానాల విషయంలో పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్టు వివరణ కోరగా భక్తులు కాలేశ్వరం వెళ్లేందుకు మండుటెండలకు జంక్ తున్నామని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలు కొనసాగుతాయని అప్పటివరకు భక్తుల సౌకర్యార్థం బస్సులను ఏర్పాటు చేస్తూనే ఉంటామని ఆర్టీసీ అధికారులు విన్నవించారు.

## విద్యా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పై విద్యాశాఖ అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన ఎంపీ



**హనుమకొండ, మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి మరియు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాల అమలుపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హన్మకొండ, కనక దుర్గా కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాల విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యగారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా అభియాన్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, వంటి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమైన విద్యా పథకాల అమలుపై అధికారుల నుండి వివరాలు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, టాయిలెట్లు, తాగునీరు, డిజిటల్ తరగతి గదులు, మరియు లైబ్రరీల ఏర్పాట్లపై సమీక్షించారు. విద్యార్థుల హాజరు శాతం, మరియు డ్రాప్ఔట్ సమస్యలపై చర్చించారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యా పథకాల అమలులో పారదర్శకత,సమర్థత పెంచాలని ఈ సందర్భంగా ఎంపీ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. పాఠశాల అభివృద్ధికి స్థానికంగా ఏర్పడిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు మరింత ప్రభావ వంతంగా పనిచేయాలన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్కు మూలస్తంభంగా మారే కార్యక్రమం కావడం తో, ప్రతి ఒక్క విద్యా పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు.ఈ సమావేశంలో జిల్లాల విద్యాశాఖ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## న్యాయవాదికి "ధమ్మపథం" బహుకరించిన ప్రఖ్యాత బౌద్ధ గురువు

**నిజాంబాద్, మే 15 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ప్రముఖ సీనియర్ న్యాయవాది, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గంట సదానందం వారి సతీమణి సులోచన గార్లకు "ధమ్మపథం" అనే గొప్ప పుస్తకాన్ని ప్రఖ్యాత బౌద్ధ పండితులు బంతే ధమ్మ రఖి?త గారు భేటీగా ఇచ్చారు. బంతే గారు బుద్ధుడి సకల త్రిపిఠిక సాహిత్యాన్ని తెలుగు భాషలో అనువదించిన గొప్ప సాహిత్యవేత్త. ఇంతేగాక ప్రపంచ బుద్ధిస్ట్ దేశాల్లోని బౌద్ధ ఇతిహాసాలను అధ్యయనం చేసిన మహామేధావి. గత నలభై ఏళ్ల నుంచి లక్షల మందికి బౌద్ధ తత్వాన్ని నూరిపోసిన నిజమైన తథాగతుడు అనడంలో అతిశయోక్తి లేదు. జిల్లా నిజామాబాద్ మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో కీర్తిగాంచిన "మోక్షనంద బుద్ధ విహార్" ను ధమ్మ రఖ?త గారే ప్రజల కోసం స్వయాన స్థాపించారు. గురువారం ఉదయం అట్టి పావన స్థలానికి ఆ దంపతులు దర్శించారు. ఈ సందర్భంగా సదానందం గారు మాట్లాడుతూ తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురు కొన్నానని, సంక్లిష్ట సమస్యలు వచ్చిన తాను డాక్టర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగానని అన్నారు. అయితే తన జీవిత చివరి దశలోనైన మానవ కళ్యాణ బౌద్ధం ధమ్మం స్వీకరించ నున్నట్లు అభిప్రాయం వ్యక్తపర్చారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశించిన కలలను సహకారం చేస్తానని ఆయన గొప్ప ప్రకటన చేశారు



# శాతవాహన వర్శిటీలో న్యాయ కళాశాలకు బార్ కౌన్సిల్ అనుమతి రావడం పట్ల బిజెపి శ్రేణుల హర్షం..

- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేగ్వాల్, బండి సంజయ్ కుమార్‌ల చిత్రపటానికి పాలాభిషేకం..
- న్యాయ కళాశాల మంజూరు కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎనలేని కృషి...
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...





**కరీంనగర్,మే15(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ పరిధిలో న్యాయ కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి రావడం పట్ల కరీంనగర్ బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం రోజున యూనివర్సిటీ ప్రాంగణం వద్ద ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అర్జున్ మెగ్వాల్, బండి సంజయ్ కుమార్ ల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా కాలేజీ మంజూరు కోసం కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంతో కృషి చేశారని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా కళాశాల అనుమతికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపినందుకు, లా కాలేజ్ నీ మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ , కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేగ్వాల్, బండి సంజయ్ కుమార్ కు భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా పక్షాన ధన్యవాదాలు తెలియజేసినట్లు చెప్పారు. ప్రధానంగా 120 మంది విద్యార్థులతో(రెండు సెక్షన్లు) ఎల్ఎల్ బి కోర్సుకు, ఈ సంవత్సరం నుండే అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇది లా విద్యను అభ్యసించే వారి భవిష్యత్తుకు ఎంతో ప్రయోజనం మేలు చేసే విషయమన్నారు.న్యాయ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా యువత న్యాయవిద్యను అభ్యసించి సమాజానికి దేశానికి సేవ చేసే అవకాశం లభిస్తుందని దానికోసం ఈ న్యాయ కళాశాల వర్గం కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా గతంలో శాతవాహన వర్శిటీలో లా కళాశాల మంజూరు చేయాలని కోరుతూ వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారని, ఈ నేపథ్యంలో గత నెల మొదటి వారంలో ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, మాజీ మేయర్ సునీల్ రావును వెంటబెట్టుకుని బండి సంజయ్ న్యూఢిల్లీలోని కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వ కార్యాలయానికి వెళ్లి, సంబంధిత శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ను కలిసి లా కాలేజీని మంజూరు చేయడంతోపాటు ఈ ఏడాది నుండే అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతూ బండి సంజయ్ కుమార్ వినతి పత్రం సమర్పించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంపై శాతవాహన వర్శిటీని వర్చువల్ గా తనఖీ చేయడంతోపాటు వివరణలతో కూడిన నివేదిక కోరిందన్నారు. లా కాలేజీ కోసం కేంద్రమంత్రి బండి సంజయ్ పట్టు పట్టి సాధించారని, ముఖ్యంగా బండి సంజయ్ కృషికి, వినతులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ శాతవాహన వర్శిటీకి లా కాలేజీకి అనుమతి ఇవ్వడంతోపాటు, విద్యా సంవత్సరం(2025-26) నుండి ఎల్.ఎల్.బి కోర్సు ప్రారంభమయ్యే విధంగా తగిన చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రోగ్రాం అనంతరం శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ను బిజెపి శ్రేణులందరూ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్ప గుచ్ఛాన్ని అందించారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్, సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, లీగల్ సేల్ జాయింట్ కన్వీనర్ చంద్రమౌళి, లీగల్ సెల్ బాధ్యులు కిరణ్ సింగ్,వెన్న ఆనందం, కామారపు విశ్వప్రసాద్, సందూరి భూమి రెడ్డి బండారి శ్రీనివాస్,చంద్రపాటి కిరణ్ కుమార్,తిరునహరి ప్రవీణ్ కుమార్ ,ఆంజనేయులు, ఎస్.దత్తాత్రేయ ,కొట్టే వంశీకృష్ణ ,చంద్ర ప్రకాష్ రెడ్డి ,ఆనంద భాస్కర్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, స్టేట్ కౌన్సిల్ మెంబర్లు దండు కొమురయ్య, నాంపల్లి శ్రీనివాస్, ఏన్నం ప్రకాష్, దూలం కళ్యాణ్, జాడి బాల్ రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్, పొన్నాల రాము, అడిచర్ల రాజు, మామిడి చైతన్య, బండారి గాయత్రీ దేవి, మల్లేశం, వాసు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం పనిచేసిన ప్రతి వ్యక్తికి అవకాశాలు వస్తాయి





**హనుమకొండ, మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల పార్టీ అని, పార్టీ కోసం పని చేసే ప్రతీ ఒక్కరికీ తప్పకుండా అవకాశాలు వస్తాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలం నిడిగొండ లోని సత్య సాయి కన్వెన్షన్ హాల్లో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జనగామ జిల్లా పిసిసి పరిశీలకులు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, లింగం యాదవ్, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ .. పైరవీలు ఉండవు.... పని చేసే వారికే అవకాశాలు వస్తాయని, పదవులకు సీనియార్టీతో పాటు సమర్థత కలిగిన అర్హులకు పదవులు అందజేయాలన్నారు. మనందరం కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులమని, త్వరలోనే మరో 1000 పైగా ఇందిరమ్మ ఇండ్లు రాబోతున్నాయి.మొదటి లిస్టులో ఇందిరమ్మ ఇండ్లు రాని అర్హులకు సెకండ్ లిస్ట్ లో ఇప్పించే బాధ్యత నాది. నా ఏజెండా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమే అని, నియోజకవర్గంలో నీటిపారుదులతో పాటు, విద్యా, వైద్యం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది.నియోజకవర్గంలో అనేక రిజర్వాయర్లు, అనేక పంట కాల్వలు ఉన్నాయి.రానున్న రోజుల్లో ప్రతి ఎకరానికి, ప్రతి గ్రామానికి సాగునీరు అందించే బాధ్యత నాది.రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ఆయకట్టు పెరిగి ధాన్యం దిగుబడి మరింత పెరుగుతుందన్నారు. ఘనపూర్ రిజర్వాయర్ నుండి నవాబు పేట ప్రధాన కాలువ సిసి లైనింగ్ ఏర్పాటుకు రూ.148కోట్లు మంజూరు అయిందని, అశ్వరావుపల్లి కుడికాలువ ద్వారా రఘునాథపల్లి లింగాల గణపురం మండలాలకు సాగునీరు అందించే ప్రయత్నం చేయడం జరుగుతుందని, చిల్పూర్, వేలేరు మండలలోని ఎగువ ప్రాంతాలకు మల్లన్న గండి ఎత్తిపోతల లకు 104కోట్లు మంజూరు తెచ్చుకున్నాం.జూలై లోపు మల్లన్న గండి ఎత్తిపోతల పనులు పూర్తి చేసి ఎగువ ప్రాంతాలకు సాగునీరు అందింస్తానని, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు గోదావరి జిల్లాలను ప్రతి ఎకరానికి ప్రతి గ్రామానికి అందజేస్తాను. ఘనపూర్ నియోజకవర్గనికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను తీసుకురావడం జరిగింది.ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ ఆఫీసెస్ కాంప్లెక్స్ ను నిర్మించుకో బోతున్నాము. బీఆర్ఎస్ పదేండ్ల పరిపాలనలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, ఒక్క ఏడాది కాంగ్రెస్ పాలనలోని ఇందిరమ్మ రాజ్యంలో 4లక్షల 50వేల ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నాం.రైతులకు మద్దతు ధరతో పాటు సన్నాలకు 500బోనస్ అందిస్తున్నాం. కాంగ్రెస్ పాలనలో పేదల ఆకలి గురించి ఆలోచించి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. పార్టీ బలంగా ఉంటేనే ప్రతి ఒక్కరికి బ్రతుకు దేరువు అని, ఎవరైతే ప్రభుత్వం పైన అసత్య ప్రచారాలు చేస్తున్నారో వాటిని తిప్పుకొట్టాలన్నారు. ఎవరైతే ప్రజల్లో ఉంటూ ప్రజల మన్ననాలు పొందుతారో వారికి నా పూర్తి సహకారం, మద్దతు ఉంటుంది.ఎవడైనా మన వైపు చూడాలంటే భయపడాలి.బిఆరఎస్ బీజేపీ పార్టీలు అక్కసుతో, అహంకారంతో మాట్లాడుతున్నాయి.కలిసి కాంగ్రెస్ పార్టీని మనం కాపాడుకుంటే పార్టీ మనలని కాపాడుతుంది. అందరం కలిసి సమన్వయంతో పనిచేసి గ్రామాలను మండలాలను అభివృద్ధి చేసుకుందామని, నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని, మండలాల్లో, గ్రామాలలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా నా వద్దకు రండి. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్, రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, దేవాలయ కమిటీ చైర్మన్లు, సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ జడ్పిటిసిలు, ఎంపిపిలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జోగినిల చౌదరి బిరుదాంకిత కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

- ఎంపీ డా.కడియం కావ్య కి ఘనస్వాగతం పలికిన జోగినిలు
- ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి చర్యలు చేపడతాము
- ట్రాన్స్ జెండర్ల ఆరోగ్యంతో పాటు, అందాల్సిన పథకాల విషయంలో నా సహకారం ఉంటుంది







**హనుమకొండ, మే 15(పిసిడబ్ల్యూ న్యూస్):**ఓరుగల్లు శివశక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చౌదరి బిరుదాంకిత కార్యక్రమానికి వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ట్రాన్స్ జెండర్లు ఆత్మగౌరవంతో జీవించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హంటర్ రోడ్ లోని నాని గార్డెన్స్ లో నిర్వహించిన ఓరుగల్లు శివశక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చౌదరి బిరుదాంకిత కార్యక్రమానికి వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినంలో కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ.. ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి చర్యలు చేపడతామన్నారు. ట్రాన్స్ జెండర్ల ఆరోగ్యంతో పాటు వారికి అందాల్సిన పథకాల విషయంలో తన సహకారం ఉంటుందని ఎంపీ తెలియజేశారు. ఆధార్ కార్డులు లేనివారికి ఆధార్ కార్డుల జారీకి చర్యలు, పేరు మార్చుకోవాలని అనుకుంటే చేయవలసిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉమెన్ ఎంపవర్మెంట్ కార్యక్రమంలో మహిళా సమస్యలతో పాటు ట్రాన్స్ జెండర్ల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలియజేశారు. ఈ భూమి మీద పుట్టిన ప్రతి ఒక్కరికి సర్వ అధికారాలు హక్కులు ఉంటాయన్నారు. ట్రాన్స్ జెండర్ల సంఘానికి గుర్తింపు రావాలి అంటే ఎక్కడైతే వెనుకబడుతామే అక్కడే మీ గుర్తింపును పెంచుకోవాలని సూచించారు. ఎన్నికల్లో సైతం పోటీ చేయాలని అప్పుడే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. 2019లో ట్రాన్స్ జెండర్ యాక్ట్ అనేది వచ్చిందన్నారు. మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పార్లమెంట్ స్థాయిలో మీ గురించి మాట్లాడి మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వరంగల్, నల్గొండ జిల్లాల జోగినిలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని కలిసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు కరుణాకర్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహాదేవపూర్ మండలంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాల పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు ఎనుముల రేవంత్ రెడ్డి కాళేశ్వరం క్షేత్రాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా, భూపాలపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కరుణాకర్ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, సాంప్రదాయబద్ధంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం కాళేశ్వరంలోని పవిత్ర దేవాలయ ప్రాంగణంలో జరిగింది. పుష్కరాల ప్రాముఖ్యతను తెలుపుతూ, ఈ పర్వదినాన ముఖ్యమంత్రి రాక భక్తులలో నూతనోత్సాహాన్ని నింపిందని కరుణాకర్ తెలిపారు.

# సరస్వతి పుష్కరాలలో సిఎంతో రామగుండం ఎమ్మెల్యే

**గోదావరిఖని: మే 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద పవిత్ర సరస్వతి పుష్కర మహెూత్సవంలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లతో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. భక్తులు ప్రజలు పాల్గొని సరస్వతి పుష్కరాల్లో అధిక సంఖ్యలో పాల్గొని ఆశీస్సులు పొందాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్ర ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిందని సౌకర్యం కూడా ప్రత్యేకంగా మహిళలకు ఆర్టీసీ ప్రత్యేక సేవలు అందిస్తు ఒదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత అధికా రులు, ఆలయ అర్చకులు,నాయకులు తదితరులు పాల్గోన్నారు.

# పాఠశాల టాపర్‌గా సురేష్..!

**రామగుండం: మే 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల వెలువడిన సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలలో ఎన్టిపిసికి చెందిన విద్యార్థి సుహాస్ సత్తా చాటాడు. ఆర్ ఎఫ్‌సిఎల్ శ్రీ చైతన్య పాఠశాలలో చదువు తున్న సుహాస్ 480/500 మార్కులు సాధించి పాఠశాలలో టాప్ త్రీ గా నిలిచాడు. గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవి పుష్ప గుచ్ఛం అందించి శు భాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి అత్యున్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు సత్యం దంపతులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

# 20న జరగబోయే భారతదేశ వ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

**- యాదాద్రి భువనగిరి జిల్లా ఐఎన్టీయుసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్**

**యాదాద్రి, మే 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడు లను రద్దు చేయాలని కోరుతూ మే 20వ తేదీన భారతదేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా ఐఎన్టీయుసి ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రమును జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏంఏ ఎజాజ్ పాల్గొని కరపత్రమును ఆవిష్కరించి మాట్లాడుతూ ఏదైతే రైతు వ్యతిరేక చట్టాలను తిప్పి కొట్టిన స్ఫూర్తితోనే, కార్మిక వ్యతిరేక లేబర్ కోడులను సైతం వెనక్కి తీసుకునేంతవరకు ఐఎన్టీయుసి ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలని కోరారు.ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీతో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీలు మూతపడి దేశంలో నిరుద్యోగం పెరిగిందని అన్నారు. కార్మిక హక్కులను హరించేందుకే ఈ లేబర్ కోర్టులను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు.ఈ కార్మిక వ్యతిరేక కోడ్ లను రద్దు చేసే వరకు, కార్మికులు చేపట్టే ప్రతి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సహకారం ఉంటుందని తెలిపారు.పట్టణ కాంగ్రెస్పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిగొండ శ్రీకాంత్ మాట్లాడుతూ కార్మిక సంఘం నాయకులు రాజీలేని పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడులను తేవడం అన్యాయమని అన్నారు.కార్మికుల హక్కులను హరించి, కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం ఎన్డీఏ ప్రభుత్వం చేస్తుందని చెప్పారు. ఐఎన్టీయుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్ మాట్లాడుతూ 20న జరిగే సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంగటిత కార్మికులు అందరూ పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసి 327 జిల్లా అధ్యక్షులు సుంకు సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దూడల రాజశేఖర్ గౌడ్,ఆటో యూనియన్ నాయ కులు కొరుటూరు సిద్ధులు, భవన నిర్మాణ సంఘ నాయకులు ఆలేటి వెంకటేష్, మున్సిపల్ విభాగం నాయకులు సిహెచ్ యాదగిరి,కె మల్లేష్,జి జెమ్మయ్యా,కె రమేష్‌లు పాల్గొన్నారు.

# శాంతి మంత్రాలకు చింతకాయలు రాలవు!



భారత్‌తో యుద్ధం గెలిచామని తమ సొంత ప్రజలను నమ్మించేందుకు పాక్ చేయని ప్రయత్నం లేదు. చివరకు విజయోత్సవాలను కూడా నిర్వహించుకుంది. ట్రంప్ కూడా తనవల్లనే యుద్ధం ఆగిందని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రచార కండూతి ఇద్దరిలోనూ కనిపిస్తోంది. అయితే ఇందులో ఏది నిజమో భారత్‌ను చూస్తే తెలుస్తుంది. పాక్ ఎందుకు కాళ్లబేరానికి వచ్చిందో చెప్పాలి. ప్రపంచాన్ని బెదిరించి పబ్బం గడుపు కునే దుస్థితిలో ట్రంప్ ఉన్నారు. అడుక్కుతినే దుస్థితిలో పాక్ ఉంది. పాక్ ముందు నుంచి నిజాయితీ ఉన్ దేశంగా పేరు సంపాదించుకోలేదు.యుద్ధాన్ని తానే ఆపానని ఓ వైపు డొనాల్డ్ ట్రంప్ ప్రచారం చేసుకుం టుంటే...మరో వైపు పాకిస్తాన్ తామే యుద్ధంలో గెలిచామని ప్రచారం చేసుకుంటోంది. డొనాల్డ్ ట్రంప్, పాకిస్తాన్‌లు చేసుకుంటున్న ప్రచారంపై అమెరికాతో సహ ప్రపంచ దేశాలు నివ్వెరపోయి చూస్తున్నాయి. భారత్ దెబ్బకు దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయిన పాక్..నిజాయితీగా బతకాలన్న ఆలోచన చేయడం లేదు. ఇండియా పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం కాల్పులు మొదలైన మూడు రోజులకే ముగిసిన సంగతి తెలిసిందే. ఎందుకు ముగిసాయన్నది పాక్‌కు బాగా తెలుసు. భారత్ కొట్టిన దెబ్బకు పాక్ కూసాలు కదిలిపోయాయి. మిస్సైల్స్, డ్రోన్ల దాడి కారణంగా భారీ ఆస్తినష్టం సంభవించింది. ఒకరకంగా పాక్‌పై కోలుకోలేని దెబ్బ పడింది. యుద్ధం ఇలాగే కొనసాగితే దేశం సర్వ నాశనం అవుతుందని పాక్ భావించింది. వెంటనే కాళ్ల బేరానికి వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సాయంతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీంతో కాల్పుల కొనసాగింపు ఆగిపోయింది. అయితే భారత్ మాత్రం ఆపరేషన్ సింధూర్ నిలిచి పోయిందని, ఎప్ఉడైనా కొనసాగుతుందని గట్టిగా హెచ్చరించింది. మోడీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం తరవాత దేశంతో పాటు, ప్రపంచానికి కూడా భారత్ సత్తా ఏమిటో మరోమారు తెలిసిపోయింది. ఇండియా దెబ్బకు తోకముడిచిన కుక్కలా పాకిస్తాన్ బిక్కచచ్చిపోయింది. దాడులు, కాల్పుల విరమణ కోసం పరుగులు తీసింది. యుద్ధంలో పాకిస్తాన్ దారుణంగా దెబ్బతింది. ఇండియా డిప్లమేటిక్‌గా.. మిలటరీ పరంగా విజయం సాధించింది. ఇండియా ఎందుకు విజయం సాధించిందనే దానికి పటిష్టమైన నాయకత్వం, మిటిటరీ ఆధునీకరణ అని చెప్పక తప్పదు. గత కొన్ని వేల సంవత్సరాలుగా పరాయి పాలనలో మగ్గిన భారత్ స్వయం సమృద్ధి సాధించి, సైనికంగా బలోపేతం అయ్యింది. ఎదుటి వారు దాడిచేస్తే దెబ్బ కొట్టాల్సిందేనన్న లక్ష్యంతో పనిచేస్తోంది. చెంపకుచెంప కాదు...కాల్లు విరగ్గొడతామన్న ధైర్యాన్ని చూపిస్తోంది. ఈ విషయం పాకిస్తాన్‌కే బాగా తెలుసు. వరుసగా ఉగ్రదాడులతో భారత్‌ను దెబ్బకొట్టాలని చూసిన పాక్ ఇప్పుడు దెబ్బతింది. ఇక జీవితంలో మరువలేని అనుభవాన్ని సంపాదించింది. ఇకనుంచి ఉగ్రదాడులకు దాడులతోనే భారత్ సమాధానం చెబుతుందన్న విషయం ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఇకపోతే ఇప్పుడు అందరి చూపు.. పాకిస్తాన్ టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న విషయం వైపే ఉంది. టెర్రరిస్టులు చనిపోయినపుడు ఆర్మీ అధికారులు యూనిఫామ్‌లో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంటే దానర్థం.. అక్కడి టెర్రరిస్టులకు.. ఆర్మీ వాళ్లకు తేడా లేదని. పాక్ చరిత్ర గురించి బాగా తెలిసిన వారు..ఈ రెంటికీ విడదీయరాని సంబంధం ఉందని గుర్తించారు. ఇండియాతో యుద్ధం చేసి ఓడిపోయిన ప్రతీసారి తామే గెలిచామని పాకిస్తాన్ జబ్బలు చరుచుకుంటోంది. అందుకే ఉగ్రవాదులకు ఊతమిచ్చే చర్యలను పక్కన పెట్టి పాకిస్తాన్ తన సొంత ఇంటిని శుభ్రం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక బంగ్లా యుద్ధంనాటి 1971తో పోల్చితే మన దేశం ఆర్థికంగా ఎన్నో రెట్లు బలపడింది. మన సైనిక శక్తి పాటవాలు కూడా అనేక రెట్లు పెరిగాయి. అందుకే డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులు చేసినప్పటికీ సమర్థంగా తిప్పి కొట్టాం. అలాగే ప్రతిదాడితో దాని పక్కటెముకలను విరగొట్టాం. మనవైపు చెప్పుకోదగిన నష్టం ఏమీ జరగలేదు. అంతర్జాతీయ సమీకరణాలు... 1971లో పాక్‌కు దన్నుగా అమెరికా, బ్రిటన్, చైనా వంటి దేశాలు నిలవగా... మన దేశానికి సమైక్య రష్యా మాత్రమే అండగా ఉండింది. ఇప్పుడు వాతావరణం మారింది. భారత్ శాస్త్ర సాంకేతికరంగంలో దూసుకు పోతోంది. భారతదేశం కూడా బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. దీంతో భారత్ నుంచి ముప్పు తప్పదని భావించిన చైనా మనతో శత్రుత్వం పెంచుకుంటోంది. చైనాకు సామంత దేశంగా ఉండటానికి భారత్ ఎప్పటికీ అంగీకరించదు. ఈ కారణంగా చైనా వ్యూహాత్మకం గా పాకిస్థాన్‌ను చేరదీస్తోంది. దాయాది దేశానికి వివిధ రూపాల్లో సహాయం చేస్తోంది. మొన్నటికి మొన్న కూడా సైనికి సాయం చేసి భంగపడింది. అందుకే అరుణాల్ విషయంలో పేచీలు పటెట్ఇ కెలక్కుంటోంది. ఇక అమెరికా కూడా చైనా ఎదుగుదలను నిరోధించే క్రమంలో దానితో సై అంటోంది. భవిష్యత్తులో చైనాతో తలపడాల్సి వస్తే భౌగోళికంగా పాక్ భూభాగం అమెరికాకు కావాలి. ఈ కారణంగా ఉగ్రవాదంపై తమది రాజీ లేని పోరు అంటూనే అమెరికా దొడ్డి దారిన పాకిస్థాన్‌కు సహాయం చేస్తోంది. ఈ నేపథ్యంలో సైనికపరంగా అత్యంత శక్తిమంతంగా ఉన్న రష్యా మాత్రమే ఎప్పటికైనా మనకు అంతో ఇంతో అండగా నిలవొచ్చు. పశ్చిమ దేశాలతో ఉన్న వైరం కారణంగా రష్యా కూడా చైనాకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరించే పరిస్థితి లేదు. ఈ కారణంగానే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు ఆర్థిక సహాయం చేయవద్దని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు భారత్ విజ్ఞప్తి చేసినా..డే వంద కోట్ల డాలర్ల సహాయం అందించడానికి అంగీకారం తెలిపింది. యుద్ధాలను భరించే స్థితిలో ప్రపంచ దేశాలు ఇప్పుడు లేవు. ఐదు దశాబ్దాల క్రితం పరిస్థితులు వేరు. అప్పుడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కూడా లేవు. 1971 యుద్ధ సమయంలో అంతర్జాతీయ పరిణామాలు మన దేశ ప్రజలపై ప్రభావం చూపలేదు. ఇప్పుడు మన దేశం నుంచి ఎగుమతులు, దిగుమ తులు కూడా పెరిగాయి. ఇప్పుడంతా అభివృద్ధి, అర్థిక వృద్ధిపైనే అన్ని దేశాలు దృష్టి సారిస్తున్నాయి. పాక్ ఇందుకు భిన్నంగా ఉగ్రవాదులను ఎగదోస్తోంది. ఇలా ఎంతకాలం చేసినా అది మనుగడ సాగించదని గుర్తిస్తే మంచిది. అలా అని పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పకుండా ఉండలేం. మన దేశంతో యుద్ధం చేసి నెగ్గలేని పాకిస్థాన్ ఉగ్ర మూకలను పెంచి పోషించి మనపైకి ఉసిగొల్పుతోంది. తృతీయ ఆర్థిక శక్తిగా ఎదగాలను కుంటున్న భారత్‌కు ఈ యుద్ధం ప్రతిబంధకమే అవుతుంది. అలా అని చేతులు ముడుచుకొని కూర్చోలేని స్థితి. కశ్మీర్ అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన పర్యాటకులను వారి భార్యల కళ్లెదుటే కాల్చి చంపిన ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం ద్వారా మన దేశాన్ని పాకిస్థానే యుద్ధ రంగంలోకి లాగింది. పాముకు పాలు పోసి పెంచితే అది ఏదో ఒకరోజు మనల్నే కాటేస్తుంది. పాకిస్థాన్‌కు కూడా ఈ పరిస్థితి ఎదురవుతోంది.

# ట్రంప్ వ్యాఖ్యలను పట్టించుకోవద్దు

- **అన్నీ తన ఘనతే అని చాటుకునే రకం**
- **మాజీ అధికారి మైఖేల్ రూబిన్ సంచలన వ్యాఖ్యలు**

**వాషింగ్టన్,మే15:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశానికి చెందిన మాజీ అధికారి మైఖేల్ రూబిన్ సంచలన కామెంట్లు చేశారు. ట్రంప్ ఓ కామెడీ పీస్ అని, భారతీయులు అతడ్ని పట్టించు కోవాల్సిన పని లేదని అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ఆపింది తానేనని ట్రంప్ ప్రచారం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. భారత్, పాకిస్తాన్‌లు కలిసి భోజనం కూడా చేయాలని ట్రంప్ అన్నారు. ట్రంప్ ప్రచారంపై పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్ మాట్లాడుతూ.. ప్రతీ దానికి తానే కారణమని ట్రంప్ గొప్పలు చెప్పుకుంటూ ఉంటాడు. మీరు గనుక ట్రంప్‌ను అడిగితే.. ఒంటి చేత్తో వరల్డ్ కప్ సాధించానంటాడు. ఇంటర్‌నెట్‌ను కనిపెట్టింది తానేనంటాడు. క్యాన్సర్‌ను నయం చేసింది కూడా తానేనంటాడు. ఈ విషయంలో భారతీయులది కూడా అమెరికన్ల పరిస్థితే. భారతీయులు ట్రంప్ మాటల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. పాకిస్తాన్ మీద కూడా ఆయన దారుణమైన కామెంట్లు చేశారు. పాకిస్తాన్‌ను కుక్కతో పోల్చారు. ఇండియా దెబ్బకు పాకిస్తాన్ తోక ముడిచిన కుక్కలా పారిపోయిందని అన్నారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ఆగిపోవటంలో తన పాత్ర ఎంతో ఉందని డొనాల్డ్ ట్రంప్ ప్రతీ చోటా చెప్పుకుని తిరుగుతున్నారు. వీలు చిక్కినప్పుడల్లా యుద్ధం గురించే మాట్లాడు తున్నారని మండిపడ్డారు. మేము అణుయుద్ధాన్ని ఆపాము. లేదంటే అదో దారుణమైన అణు యుద్ధం అయి ఉండేది. యుద్ధం కారణంగా లక్షల మంది ప్రాణాలు పోయి ఉండేవి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబిన్‌లకు నా కృతజ్ఞతలు. గత శనివారం నా కారణంగానే రెండు దేశాల మధ్య యుద్ధం వెంటనే ఆగిపోయింది. రెండు దేశాల దగ్గర చాలా అణు బాంబులు ఉన్నాయి. రెండు దేశాలు యుద్ధం ఆపడానికి మేము ఎంతో సాయం చేశాము. వ్యాపార పరంగా కూడా సాయం చేస్తున్నాము. యుద్ధం ఆపితేనే వ్యాపారం చేస్తామని చెప్పాము. లేదంటే వ్యాపారం చేయము అని స్పష్టం చేశామని అన్నారు. అంతర్జాతీయంగా ఎవరి ప్రయోజనాలు వారికి ఉంటాయి. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం కారణంగా ఉభయ దేశాలూ నష్టపోయాయి. రష్యాకు తిరుగులేని సైనిక శక్తి, ఆయుధ సంపద ఉన్నప్పటికీ... పశ్చిమ దేశాలు, ముఖ్యంగా అమెరికా అండతో ఉక్రెయిన్ ఎదురొడ్డి నిలబడగలుగుతోంది. రష్యాతో తలపడటానికి అవసరమైన సహాయం కోసం ఉక్రెయిన్ తమ దేశంలోని సహజ వనరులు, ముఖ్యంగా ఖనిజ సంపదపై హక్కులను అమెరికాకు ధారాదత్తం చేయాల్సి వచ్చింది. మరోవైపు రష్యా కూడా పూర్వం ఉన్నట్టుగా ఆర్థికంగా పటిష్ఠంగా లేదు. ఈ క్రమంలో రూబిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇంటర్నెట్ కనిపెట్టడం నుంచి క్యాన్సర్‌ను నయం చేసేవరకు అన్నింటికీ క్రెడిట్ తీసుకోవడం ట్రంప్‌నకు అలవాటేనని రూబిన్ ఎద్దేవా చేశారు. డొనాల్డ్ ట్రంప్ ప్రతిదానికీ క్రెడిట్ పొందేందుకు ఇష్టపడతారు. మీరు ఆయన్ను అడిగితే.. ప్రపంచ కప్‌ను గెలుచుకున్నానని, ఇంటర్నెట్ కనుగొన్నానని, క్యాన్సర్‌ను నయం చేశానని చెప్పుకుంటారు. భారత్- పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో కూడా ఆయన అదే చేస్తున్నారు. ఈ విషయంలో అమెరికన్లలాగానే భారతీయులు ఆయన మాటలు పట్టించుకోవద్దు' అని రూబిన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా భారత్- పాక్‌ల మధ్య వివాదం తలెత్తినప్పుడల్లా అమెరికా తెరవెనుక మధ్యవర్తిత్వం వహించడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఇరుదేశాల మధ్య శాంతి ప్రక్రియలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోలు పాలుపంచుకున్నారని కొనియాడారు.



# ముక్తిదాయకం.. పుష్కర స్నానం



కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతీ నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతోపాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే పానవట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి. కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు.ఆలయంలో శివలింగంపై పోసిన నీరు, ఆ లింగంలోని నాసికా రంధ్రాల ద్వారా భూమార్గంలో ప్రవహించి గోదావరి, ప్రాణహిత నదులతో కలుస్తుంది. అందుకే ఇక్కడ సరస్వతీ పుష్కరాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాళేశ్వరం పెద్దల పిండ ప్రదానానికి కూడా ముఖ్యమైన క్షేత్రం. కాశికి వెళ్లలేనివారు ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ఇది కాశిలో జరిపినంత పుణ్యప్రదమని విశ్వసిస్తారు. అలాగే, కాళేశ్వరంలో దక్షిణ భారతదేశంలోనే అరుదైన సరస్వతీ దేవి ఆలయాలలో ఒకటి ఉంది. మరొక అరుదైన సూర్యదేవాలయం కూడా ఇక్కడే కొలువై ఉండటం విశేషం.'మేషే గంగా వృషే రేవా మిథునేతు సరస్వతీ కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా కన్యాయాం కృష్ణవేణీచ కావేరీ ధటకే స్మృతా వృశ్చికే తామ్రపర్ణీచ చాపే పుష్కర వాహినీ మకరే తుంగభద్రాచ కుంభే సింధునదీ స్మృతా మీనే ప్రణీతా నదీచ గురోస్సంక్రమణే స్మృతా పుష్కరాఖ్యా మునీనాంహి బుధై స్మృతా' దేవగురువగు బృహస్పతి మేష రాశిలో ఉన్నప్పుడు గంగానదికి, వృషభరాశిలో ఉన్నప్పుడు నర్మదా నదికి, మిథున రాశిలో ఉన్నప్పుడు సరస్వతీ నదికి, కర్కాటక రాశిలో ఉన్నప్పుడు యమునా నదికి, సింహరాశిలో ఉన్నప్పుడు గోదావరి నదికి, కన్యారాశిలో ఉన్నప్పుడు కృష్ణా నదికి, తులారాశిలో ఉన్నప్పుడు కావేరి నదికి, వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు తామ్రపర్ణి నదికి, ధనూరాశిలో ఉన్నప్పుడు బ్రహ్మపుత్రకు, మకర రాశిలో ఉన్నప్పుడు తుంగభద్రా నదికి, కుంభరాశిలో ఉన్నప్పుడు సింధునదికి, మీనరాశిలో ఉన్నప్పుడు ప్రణీతా నదికి పుష్కరాలు చెప్పబడ్డాయి.పుష్కరం అనగా జలస్వరూపం జలాది దేవతగా సమస్త తీర్థములకు నెలవై ఉండి తీర్థరాజు అను పేరుతో లోకకళ్యాణ కారకు డైనట్లు శాస్త్రములు తెలుపుతున్నాయి. పూర్వం తుందిలుడనే బ్రహ్మణోత్తముడు మహేశ్వరుని గూర్చి తపస్సు చేసి తన అష్ట-మూర్తులతో ఒకటైన జల స్వరూపంతో పుష్కరుడు అను నామముతో పరమ శివుని ఐక్యమై ఉండుటకు వరం పొంది, పరమేశ్వరుని సాయుజ్యం పొంది ఉండగా బ్రహ్మదేవుడు సృష్టిని శక్తివంతం చేయుటకై శివుని వరంతో ఆ పుష్కరుని స్వీకరించి, తన కమండలంలో ఉంచుకొని సృష్టికార్యం నిర్వహిస్తుండగా, బృహస్పతి బ్రహ్మను వేడుకొని ఆ పుష్కరుని తన వెంట ఉండుటకై వరమును కోరెను. గ్రహాధి పత్యమును, ముక్కోటి దేవతలకు గురువుగాను ఆ పుష్కరుని సన్నిధిని శక్తివంతుడై యుండునట్లు కోరుకొనగా పుష్కరుడు బ్రహ్మను వీడి రాకకు సమ్మతించక పోగా బ్రహ్మదేవుడు, ఆ పుష్కరుని కోరికపై ముక్కోటి దేవతలతో మూడున్నర కోట్ల తీర్థములతో, మహర్షులతో, ఆ పుష్కరుని వెంట ఉండి, బృహస్పతి, ఆయా రాసులలో (మేషాది రాసులలో) చరించుచున్నప్పుడు ఆయా నదులకు (మేషేచ -గంగా) అను సూత్రానుసారం పుష్కరాలు నిర్వహిస్తారు.ప్రతి నదికి ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పన్నెండు రోజులపాటు పుష్కరాలను ఎంతో వైభవంగా నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా 2025 మే 15 నుంచి మే 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు నిర్వహిస్తారు. సరస్వతీ నది హిందూ పురాణాలలో ఒక ముఖ్యమైన నది. ఋగ్వేదంలో ఈ నదిని ఎంతో పవిత్రంగా కీర్తించారు. తూర్పున యమునా నది, పశ్చిమాన శతద్రూ నది దీనికి సరిహద్దులుగా ఉండేవి. అయితే, మహాభారత కాలానికి ఈ నది ఎండిపోయినట్లు చెబుతారు. ప్రస్తుతం సరస్వతి పేరుతో ఒక చిన్న నది ఘగ్గర్ నదికి ఉపనదిగా ప్రవహిస్తోంది. చాలా మంది పండితులు ప్రాచీన సరస్వతీ నది ఇదే అయి ఉండవచ్చని భావిస్తున్నారు.సరస్వతీ దేవి తొలుత నదీ దేవతగా ఆరాధింపబడి, తరువాత విద్య, జ్ఞాన, సంగీత, కళల అధిదేవతగా గుర్తింపు పొందింది. హిందువులు సరస్వతీ నదిని అంతర్వాహినిగా భావిస్తారు. గంగా, యమునా నదుల సంగమమైన త్రివేణి సంగమంలో సరస్వతి కూడా కలిసి ఉంటుందని విశ్వసిస్తారు. సరస్వతీ పుష్కరాల సమయంలో భక్తులు అనేక పవిత్ర కార్యకలాపాలలో పాల్గొంటారు. ధ్యానం చేయడం, సాంప్రదాయ ఆచారాలను పాటించడం, ప్రార్థనలు చేయడం, పవిత్ర స్నానాలు ఆచరించడం వంటివి ముఖ్యమైనవి. ఈ సమయంలో నదిలో స్నానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్ముతారు. 2025లో జరగబోయే సరస్వతీ పుష్కరాలు బద్రీనాథ్ సమీపంలోని మానా గ్రామంలో ముఖ్యంగా జరగనున్నాయి. ఇక్కడ ఈ నది అలకనంద నదిలో కలుస్తుంది.అలాగే ప్రయాగరాజ్‌లో కూడా త్రివేణీ సంగమంలో పుష్కరాలు నిర్వహిస్తారు. అయితే, తెలంగాణ రాష్ట్రంలో కూడా సరస్వతీ పుష్కరాలను నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరంలో ఈ పుష్కరాలు జరగనున్నాయి.
కాళేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులు సంగమిస్తాయి. ఈ సంగమ స్థానంలోనే అంతర్వాహినిగా సరస్వతీ నది కూడా కలుస్తుందని నమ్ముతారు. అందుకే కాళేశ్వరాన్ని దక్షిణ కాశిగా పిలుస్తారు. ఇక్కడ శివలింగంతోపాటు యమలింగం కూడా ఉండటం విశేషం. పూర్వం యముడు మనుషుల పాపాలను తొలగించి వారికి ముక్తిని ప్రసాదించమని శివుడిని ప్రార్థించగా, శివుడు ఆ కోరికను మన్నించాడు. అందువల్ల ఇక్కడ ఒకే పానవట్టంపై రెండు లింగాలు కొలువై ఉన్నాయి.కాళేశ్వరంలో సరస్వతీ నది గుప్త కామినిగా ప్రవహిస్తుందని చెబుతారు.

# యువ ఆటగాడికి స్థానం కోసమే కోహ్లీ రిటైర్మెంట్!!



దిగ్గజ క్రికెటర్లు విరాట కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడం వెనకాల చాలా పెద్ద కథే నడిచిందని తాజాగా కొన్ని కథనాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా కోహ్లీ సడెన్ రిటైర్మెంట్ నిర్ణయం వెనకాల ఒక ఉద్దేశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే సీనియర్ ఆటగాళ్లు రిటైర్మెంట్ కు దగ్గర పడిన స్థితిలో జట్టు సంధి కాలంలో కెప్టెన్ గా ఉండాలని కోహ్లీ భావించాడని తెలుస్తోంది. అందుకే ఇంగ్లాండ్ పర్యటనకు తనను సారథిగా ఎంపిక చేయాలని బోర్డును కోరాడని సమాచారం. అయితే ఈ నిర్ణయాన్ని బోర్డు సున్నితంగా తిరస్కరించి, యువ ఆటగాడికి ఇవ్వనున్నామని చెప్పడంతో కోహ్లీ ఇలా సడెన్ గా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు గత రెండేళ్లుగా ఫామ్ లేమితో సతమతమవుతున్న కోహ్లీ.. తన వీడ్కోలు సిరీస్ లాగా ఇంగ్లాండ్ సిరీస్ ఆడాలని, అందులో సత్తా చాటి, తనకెంతో ఇష్టమైన రెడ్ బాల్ ఫార్మాట్ కు టాటా చెప్పాలని భావించినట్లు తెలుస్తోంది. బీసీసీఐ నిర్ణయంతో అసంతృప్తికి లోనయిన కోహ్లీ.. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రితో పంచుకున్నాడని సమాచారం. అలాగే తన డియరెస్ట్ ఫ్రెండ్ తోపాటు బోర్డులోనే చాలా ఇన్ఫ్లుయెన్స్ ఉన్న రాజీవ్ శుక్లాతో పలు దఫాలుగా ఈ నిర్ణయంపై చర్చలు జరిగాయని తెలుస్తోంది. అయితే ఇవేమీ కోహ్లీ రిటైర్మెంట్ నిర్ణయాన్ని మార్చలేక పోయాయని, దీంతో ఆటకు అల్విదా పలికినట్లు సమాచారం. అలాగే నిర్ణయాన్ని ప్రకటించేముందు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తోనూ రెండుసార్లు మాట్లాడాడని, ఐపీఎల్ కు స్మాల్ బ్రేక్ రావడంతో, ఈ చర్చలు ముమ్మరంగా సాగినట్లు తెలుస్తోంది.గతంలో ఉన్నట్లుగా డ్రెస్సింగ్ రూం.. ప్రస్తుతం లేదని, తనకు ఫ్రీ హ్యాండ్ ఇవ్వడం లేదని కోహ్లీ కంప్లయింట్ చేసినట్లు తెలుస్తోంది. అలాగే మునుపటిలాగా సీనియర్లకు ఉన్న సౌకర్యాలు కరువైనట్లు తెలుస్తోంది. ఈ విషయమై బోర్డు పెద్దలతో మాట్లాడినా పెద్దగా ఫలితం లేదని సమాచారం. నిజానికి ఇంగ్లాండ్ టూర్ తర్వాత రోహిత్, కోహ్లీ రెడ్ బాల్ కు దూరమవ్వాలని భావించారని, అయితే పరిస్థితులు అనుకూలించక అంతకుముందు గానే అల్విదా చెప్పినట్లు తెలుస్తోంది. ఇక రెడ్ బాల్ క్రికెట్లో పది వేల పరుగులను సాధించాలని కోహ్లీ ఎన్నోసార్లు చెప్పాడు. అయితే ఆ కోరిక తీరకుండానే తను టెస్టు ఫార్మాట్ కు వీడ్కోలు పలికాడు. అలాగే కేవలం వన్డేలకే పరిమితమవడంతో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన అంతర్ జాతీయ వంద సెంచరీల రికార్డును కూడా విరాట్ కోహ్లీ చేరే అవకాశం లేదని తెలుస్తోంది.

# 2025 ఐపీఎల్ మే 17న రీస్టార్ట్

**● హంగు, ఆర్భాటాలు లేకుండా నిర్వహణ!!**

2025 ఐపీఎల్ మే 17న రీస్టార్ట్ కానుంది. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న జట్లన్నీ టోర్నీకి రెడీ అవుతున్నాయి. ఆటగాళ్లు ఇప్పటికే తమతమ ఫ్రాంచైజీ క్యాంపుల్లో చేరి ప్రాక్టీస్ మొదలు పెట్టేశారు. మే 17న ఆర్సీబీ- కేకేఆర్ మ్యాచ్?తో టోర్నీ పునః ప్రారంభం కానుంది. అయితే మిగిలిన మ్యాచ్?లను ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుత ఐపీఎల్?లో ప్లేఆఫ్స్? సహా 17 మ్యాచ్?లు మిగిలి ఉన్నాయి. అయితే ఈ మ్యాచ్?లను సింపుల్?గానే నిర్వహించాలని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ బీసీసీకి సూచించాడు. గ్రౌండ్?లో చీర్ లీడర్స్, డీజే హడావుడి లేకుండా టోర్నీ జరపాలని బోర్డుకు చెప్పాడట. గతనెల కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో కుటుంబాల గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే గావస్కర్ ప్రస్తావించిన అంశాన్ని బీసీసీఐ కూడా పరిగణలోకి తీసుకున్నట్లు సమాచారం.



అందుకు సమ్మతిస్తూ హంగు, ఆర్భాటాలు లేకుండా మిగతా మ్యాచ్లు నిర్వహించేందుకు బీసీసీఐ ప్లాన్? చేస్తున్నట్లు తెలుస్తోంది.కాగా, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో మే 08న టోర్నీ తాత్కాలిక వాయిదా పడింది. ధర్మశాల వేదికగా జరిగిన దిల్లీ- పంజాబ్ మ్యాచ్?ను మధ్యలోనే రద్దు చేశారు. దేశంలో నెలకొన్ని టెన్షన్ వాతావరణం దృష్ట్యా టోర్నీకి బ్రేక్ ఇచ్చారు. తాజాగా భారత్- పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం వల్ల టోర్నమెంట్?ను మళ్లీ ప్రారంభిస్తున్నారు. అయితే భద్రతా కారణాల వల్ల మిగిలిన టోర్నీని ఆరు వేదికల్లో నిర్వహిస్తున్నారు. మే 17న పునః ప్రారంభం కానున్న టోర్నీ జూన్ 03న ముగుస్తుంది. అయితే ఈసారి ఐపీఎల్?లో ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా సాగేలా కనిపిస్తోంది. టోర్నీలో ఇప్పటికే 57 మ్యాచ్?లు పూర్తైనా అధికారికంగా ఏ జట్టు కూడా ప్లే ఆఫ్స్?కు అర్హత సాధించలేదు. మూడు (సన్?రైజర్స్, రాజస్థాన్, చెన్నై) జట్లకు మినహా ఏడు టీమ్స్?కు ప్లేఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉన్నాయి. దీంతో మిగిలిన టోర్నీ ఫుల్ మజా అందించడం పక్కా.

# పీఎస్ఎల్‌ను వదిలి ఐపీఎల్‌లోకి!!

భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత ఇప్పుడు ముగిసింది. సరిహద్దులో ఇప్పుడు పూర్తి ప్రశాంత వాతావరణం నెలకొంది. అయితే ఈ ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్, పీఎస్-ఎల్(పాకిస్తాన్ సూపర్ లీగ్)లను మధ్యలో వాయిదా వేయాలని నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. ఐపీఎల్ 2025 మిగిలిన మ్యాచ్లు మే 17 నుంచి ప్రారంభం కానున్నాయి. అదే సమయంలో పాకిస్థాన్ సూపర్ లీగ్ 10వ సీజన్ మ్యాచ్లు కూడా ఈ తేదీ నుంచి జరుగుతాయి.భద్రతా కారణాల దృష్ట్యా విదేశీ ఆటగాళ్లందరూ రెండు టోర్నమెంట్ల నుంచి నిష్క్రమించి తిరిగి ప్రారంభమవుతుందనే సమయంలో మళ్లీ తిరిగి వచ్చారు. ఇప్పుడు ఒక ఆస్ట్రేలియన్ ఆటగాడు పీఎస్ఎల్ 2025 టోర్నీలో పాల్గొనడానికి పాకిస్థాన్ చేరుకోవలసి ఉంది. కానీ ఈ ఆటగాడు పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను విడిచిపెట్టి ఐపీఎల్‌లో ఆడటానికి వచ్చాడు. ఆ విధ్వంసక ఆసీస్ బ్యాటర్ పంజాబ్ కింగ్స్ జట్టులో చేరాడు.ఐపీఎల్ ఆడటానికి పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను మధ్యలో వదిలిపెట్టిన ఆటగాడి పేరు మిచెల్ ఓవెన్. గ్లెన్ మ్యాక్స్‌వెల్ టోర్నమెంట్ నుంచి తప్పుకున్న తర్వాత అతని స్థానంలో పంజాబ్ కింగ్స్ మిచెల్ ఓవెన్‌ను జట్టులోకి తీసుకుంది. పీఎస్ఎల్‌లో బాబర్ ఆజం కెప్టెన్సీలో పెషావర్ జల్మీ తరఫున ఆడిన తర్వాత మిచెల్ ఓవెన్ పాకిస్థాన్ సూపర్ లీగ్‌లోనే మళ్లీ ఆడతాడని భావించారు. కానీ మిచెల్ ఓవెన్ పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను విడిచిపెట్టి ఐపీఎల్‌లో పాల్గొనడానికి భారత్‌కు చేరుకున్నాడు. పంజాబ్ కింగ్స్ తమ ఎక్స్ ఖాతాలో మిచెల్ ఓవెన్ ఫోటోను కూడా షేర్ చేసింది.ఆసీస్ క్రికెటర్ మిచెల్ ఓవెన్ తన విస్ఫోటక బ్యాటింగ్‌కు ప్రసిద్ధి చెందాడు. చివరి మ్యాచ్‌లో హెూబర్ట్ హరికేన్స్ తరఫున ఆడుతూ మిచెల్ ఓవెన్ తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించాడు. మిచెల్ ఓవెన్ 42 బంతుల్లో 108 పరుగులు చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 257 స్ట్రైక్ రేట్‌తో ఆడిన ఈ ఆసీస్ క్రికెటర్ 11 అద్భుతమైన సిక్సర్లు కొట్టి చివరి మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షంగా మార్చేశాడు. ఐపీఎల్‌లోని మిగిలిన మ్యాచ్‌లలో మిచెల్ ఓవెన్ నుంచి పంజాబ్ జట్టు అలాంటి ప్రదర్శనను ఆశిస్తుంది.

# 10వ తరగతి పరీక్షల్లో ఫెయిలైన వైభవ్ సూర్యవంశీ



యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి వార్తల్లోకెక్కాడు. ఇటీవల వైభవ్ ఐపీఎల్?లో అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డ్ కొట్టాడు. ఆ తర్వాత కెరీర్?లో ఆడిన మూడో మ్యాచ్?లోనే విధ్వంసం సృష్టించాడు. కేవలం 35 బంతుల్లోనే సెంచరీ బాది యావత్ క్రికెట్ ప్రపంచం దృష్టిని తన వైపునకు తిప్పుకున్నాడు. ఇవన్నీ అటుంచితే తాజాగా మరోసారి వైభవ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాడు. అతడు 10వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్?ఈ) ఇటీవల 10వ తరగతి పరీక్ష ఫలితాలు వెల్లడించింది. ఈ ఫలితాల్లో ఐపీఎల్ సంచలనం వైభవ్ ఫెయిల్ అయ్యాడంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. అతడి పరీక్షా పేపర్లను బీసీసీఐ డీఆర్ఎస్ పద్ధతిలో రివ్యూ చేయాలంటూ ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. అయితే అది 'సెటైరికల్ పోస్ట్'. వైభవ్ 10వ తరగతి ఫెయిల్ అయ్యాడంటూ వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదు.'ఫెయిల్ అయ్యాడనే దాంట్లో నిజం లేదు. మరి పాసయ్యాడా?' అంటూ ఫ్యాన్స్ గూగుల్?లో తెగ వెతికేస్తున్నారు. అయితే వైభవ్ పాస్ కూడా కాలేదు. అదేంటి అనుకుంటున్నారా? అసలు పరీక్ష రాస్తేనే కదా, ఫెయిల్ లేదా పాస్ అయ్యేది. వాస్తవానికి వైభవ్ ఈ ఏడాది ఎలాంటి CBSE 10th పరీక్షలు రాయలేదు. సోషల్ మీడియా పోస్టులన్నీ ఉత్తుత్తి ప్రచారమే!అయితే వైభవ్ ఐపీఎల్? కారణంగానే పది పరీక్షలు రాయలేదని కథనాలు వస్తున్నాయి. అవి కూడా రూమర్సే. ఎందుకంటే వైభవ్ ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన మనోడు 10వ పరీక్షలకు ఇంకో ఏడాది సమయం ఉందన్న మాట!ఇక వైభవ్ క్రికెట్ కెరీర్ విషయానికొస్తే, గతనెల లఖ్?నవూ మ్యాచ్?తో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఈ సీజన్?లో 5 మ్యాచ్?ల్లో వైభవ్ 155 పరుగులు చేశాడు. ఇందులో గుజరాత్?పై 35 బంతుల్లో సెంచరీ బాది, ఐపీఎల్?లో అత్యంత వేగంగా శతరం నమోదు చేసిన భారత బ్యాటర్?గా నిలిచాడు. ఇక గతేడాది జరిగిన మెగా వేలంలో రాజస్థాన్ ఫ్రాంచైజీ అతడిని రూ. 1.10 కోట్లకు దక్కించుకుంది.

# విరాట్ కోహ్లీ దగ్గర శిక్షణ పొందా...

**● సంజయ్ బంగర్ కుమార్తె అనయ బంగర్**

భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె అనయ బంగర్ విరాట్ కోహ్లీతో తన సంభాషణను గుర్తు చేసుకుంది. తన తండ్రితో పాటు విరాట్ కోహ్లీ దగ్గర శిక్షణ పొందానని చెప్పింది. ఆ సమయంలో విరాట్ కోహ్లీ అనయ బంగర్‌కు బ్యాటింగ్ చిట్కాలు కూడా ఇచ్చినట్లు తాను చెప్పుకొచ్చింది. గతేడాది తన హార్మోన్ల మార్పుల కారణంగా వార్తల్లో నిలిచిన అనయ బంగర్.. విరాట్ కోహ్లీ నుంచి సలహాలు తీసుకున్నానని.. కోహ్లీ తన బలాలపై దృష్టి పెట్టమని ప్రోత్సహించినట్లు చెప్పింది.అనయ బంగర్ మాట్లాడుతూ.. "నేను విరాట్ కోహ్లీని చాలా సార్లు కలిశాను. నా తండ్రితో పాటు విరాట్ కోహ్లీ దగ్గర శిక్షణ కూడా పొందాడు. కోహ్లీ నాకు కొన్ని సలహాలు ఇచ్చాడు. నేను బ్యాటింగ్ చేయడం చూశాడు. కోహ్లీ బ్యాటింగ్ చేయడాన్ని దగ్గరగా చూసే అవకాశం నాకు లభించింది" అంటూ అనయ బంగర్ చెప్పుకొచ్చింది.మ్యాచ్ ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటారని విరాట్ ను ఒకసారి అడిసారి అడిగినట్లు అనయ బంగర్ తెలిపింది. తమ సొంత బలాలను పూర్తిగా అర్థం చేసుకుని నమ్మే స్థాయి వరకు ప్రాక్టీస్ చేస్తామని విరాట్ కోహ్లీ తనకు చెప్పారని ఆమె వెల్లడించింది. మైదానంల తాము ఏం చేయగలరో వారికి తెలుసన్నారు. వారు దానిని నమ్ముతారని అనయ బంగర్ పేర్కొంది.బుధవారం 14న అనయ బంగర్ సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేసింది. అందులో ఆమె క్రికెట్ ఆడుతున్నట్లు కనిపించింది. ఆమె ఫ్రంట్ ఫుట్ ఆడుతున్నట్లు కనిపించింది. ఆ క్లిప్‌కు క్యాప్షన్ ఇస్తూ ఆమె ఇలా రాసుకొచ్చింది. "నా వద్ద నుంచి ఏదో పెద్ద విషయం రాబోతోందని మీకు తెలియజేస్తున్నాను" అంటూ రాసుకొ చ్చింది. టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ విషయానికొస్తే.. కోహ్లీ మే 12న టెస్ట్ క్రికెట్ కు వీడ్కోలు పలికాడు. టెస్ట్ క్రికెట్ లో భారత్ తరఫున అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబి తాలో కోహ్లీ నాల్గవ స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లో 2011లో అరంగేట్రం చేశాడు.



# టెస్ట్ కెప్టెన్ రేసులోకి మరో పేరు!

**● రెండేళ్ల పాటు కెప్టెన్‌గా రవీంద్ర జడేజా?!**

రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత టీమిండియా కొత్త టెస్ట్ కెప్టెన్ గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి. భారత జట్టు కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా పేర్లు ముందంజలో ఉన్నాయి. జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని, కెప్టెన్సీ బాధ్యతను శుభ్‌మన్ గిల్‌కు అప్పగించవచ్చని భావిస్తున్నారు. అయితే భారత మాజీ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ కెప్టెన్ కోసం ఒక ఆటగాడి పేరును సూచించాడు. అశ్విన్ సూచించిన ఆటగాడి పేరు కూడా ఎప్పుడూ చర్చలోకి రాలేదు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్ అయిన తర్వాత జట్టులో అత్యంత అనుభవజ్ఞుజైన ఆటగాడిని జట్టుకు కెప్టెన్‌గా చేయాలని అశ్విన్ సూచించాడు.రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పోర్ట్స్ జర్నలిస్ట్ విమల్ కుమార్‌తో మాట్లాడుతూ .. టీమిండియా కొత్త టెస్ట్ కెప్టెన్ గురించి మాట్లాడారు. 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌పై ఇప్పుడు అంత ఒత్తిడి తీసుకురావడం సరైనది కాదని అశ్విన్ అన్నాడు. రవీంద్ర జడేజాను రెండేళ్ల పాటు కెప్టెన్‌గా చేయవచ్చని ఆయన అన్నారు. "జట్టులో అత్యంత అనుభవజ్ఞుడైన ఆటగాడు రవీంద్ర జడేజా. మీరు కొత్త ఆటగాడికి శిక్షణ ఇవ్వాలనుకుంటే జడేజాను రెండేళ్లపాటు కెప్టెన్‌గా చేయండి. జడేజా రెండేళ్ల పాటు జట్టుకు నాయకత్వం వహించవచ్చు. శుభ్‌మన్ గిల్‌ను రవీంద్ర జడేజాకు డిప్యూటీ అంటే వైస్ కెప్టెన్‌గా చేయవచ్చు" అని అశ్విన్ అన్నాడు.భారత జట్టుకు కెప్టెన్ కావడం ప్రతి ఆటగాడి కల అని అశ్విన్ అన్నాడు. ఈ క్రమంలో రవీంద్ర జడేజా కూడా ఈ పాత్రను సంతోషంగా అంగీకరిస్తాడని చెప్పుకొచ్చాడు. జడేజాను కెప్టెన్ గా చేయమని తాను బలవంతం చేయడం లేదని.. కానీ జడేజాకు కెప్టెన్సీని అప్పగించడంలో ఎటువంటి హాని లేదని అశ్విన్ పేర్కొన్నాడు.రవీంద్ర జడేజా గతంలో ఐపీఎల్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే రవీంద్ర జడేజా కెప్టెన్సీలో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన చాలా నిరాశపరిచింది. రవీంద్ర జడేజా సీజన్ మధ్యలో కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. రవీంద్ర జడేజాకు అనుభవానికి లోటు లేదు. రవీంద్ర జడేజా 2012లో టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. అంటే జడేజా భారత్ తరఫున టెస్టుల్లో 13 సంవత్సరాల నుంచి ఆడుతున్నాడు. జడేజా తన బ్యాటింగ్, బౌలింగ్‌తో టీమిండియా అనేక మ్యాచ్‌లను గెలిపించడంలో సహాయపడ్డాడు.



# మ్యాన్ ఆఫ్ ద మ్యాన్షన్ హౌజ్






నందమూరి బాలకృష్ణ ఓ పాపులర్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా చేస్తున్నారు. అది కూడా ఆయనకు నచ్చిన బ్రాండ్ కావడం విశేషం. ఇంతకు ముందు ఆయన కొన్ని యాడ్స్ చేసినా... ఇది మాత్రం సమ్‌థింగ్ స్పెషల్ అని చెప్పాలి. బాలయ్య చేసిన కొత్త యాడ్ తాజాగా విడుదల చేశారు. బాలయ్యకు ఇష్టమైన డ్రింకింగ్ బ్రాండ్ ఏది? అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అమెరికా వెళ్లినా సరే తన వెంట మ్యాన్షన్ హౌస్ తీసుకుని వెళతారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన చిన్న అల్లుడు చెప్పిన విషయం తెలిసిందే. కానీ ఎప్పుడూ దాని గురించి బాలయ్య తన నోటి వెంట చెప్పింది లేదు. కానీ ఈసారి ఏకంగా ఈ బ్రాండ్ పై యాడ్ చేసి షాక్ ఇచ్చాడు. ఈ యాడ్‌లో బాలయ్య లుక్ అదిరిపోయింది. అయితే ఆహా తెలుగు ఓటీటీలో ఆయన హోస్ట్ గా చేసిన 'అన్‌స్టాపబుల్' టాక్ షోకి మ్యాన్షన్ హౌస్ అడ్వర్టయిజింగ్ ప్పార్టర్ అయింది. అప్పుడు మొదటిసారి బాలయ్య నోటి వెంట మ్యాన్షన్ హౌస్ అని వచ్చింది. ఇప్పుడు డైరెక్ట్ గా ఆ సంస్థకు ఆయన ప్రచారం చేస్తూ ఒక వాణిజ్య ప్రకటన చేయడం విశేశం ప్రజంట్ ఈ యాడ్ వైరల్ అవుతుంది.

# రాజ్‌తో సమంత..సతీమణి శ్యామాలి పోస్ట్ వైరల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యాక్తిగత జీవితం గురించి రోజుకో వార్త వైరల్ అవుతూనే ఉంటోంది. ఎంతో ప్రేమించిన అక్కినేని నాగచైతన్యతో విడాకుల తర్వాత సింగిల్‌గా ఉంటుంది సమంత. నాగచైతన్య రెండో పెళ్లి చేసుకోని హ్యాపి లైఫ్ లీడ్ చేస్తున్నప్పటికి సమంత కూడా రెండో పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అభిమానులు, సినీ ప్రియులు కోరుకుంటు-న్నారు. అయితే కొద్ది రోజులుగా దర్శకుడు రాజ్ నిడిమోదుతో తరచు కనిపిస్తోంది సామ్.. ఎక్కడికి వెళ్లిన సమంత పక్కన రాజ్ ఉంటున్నాడు. దీంతో ఆమె వైవాహిక జీవితం పై నెట్టింట రూమర్స్ గట్టిగానే ప్రచారం అవుతున్నాయి. అయితే రాజ్ నిడిమోరుకు ఇప్పటికే పెళ్లి అయ్యింది. ఇలాంటి టైం లో తాజాగా సమంత తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఇందులో రాజ్‌పై సమంత వాలినట్టుగా కనిపిస్తుంది. దీంతో ఈ వార్తలు మరింత పుంజుకున్నాయి. వారి బాండింగ్ రోజు రోజుకి బలపడుతుందిగా అని కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. అయితే తాజాగా రాజ్ సతీమణి శ్యామాలి తాజాగా ఎక్స్ వేదికగా ఒక సందేశాత్మక పోస్ట్ పెట్టింది.. 'నా గురించి ఆలోచించి, విని, మాట్లాడేవారితోపాటు నన్ను కలిసి, నాతో మాట్లాడి నా గురించి రాసే వారందరికి ప్రేమ, ఆశీస్సులు పంపుతున్నా' అనే పోస్ట్ ను ఆమె షేర్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ గా మారింది. కొంతకాలంగా ఎలాంటి పోస్ట్ షేర్ చేయని ఆమె ఉన్నట్టుండి ఇలాంటి సందేశం ఎందుకు షేర్ చేశారా? అని, ఆమె కచ్చితంగా సమంతని ఉద్దేశించే మాట్లాడుతూంది అని కామెంట్ లు విపడుతున్నాయి.



# సరిగమకు ది ప్యారడైజ్ ఆడియో హక్కులు




హిట్ 3తో సూపర్ హిట్ అందుకున్న నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటంతో పాటలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ఆడియో హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్లు తెలుస్తుంది. ప్రముఖ మ్యూజిక్ కంపెనీ సరిగమ మ్యూజిక్ రూ. 18 కోట్లకు 'ది ప్యారడైజ్' ఆడియో రైట్స్‌ని దక్కించుకున్నట్లు సమాచారం. నాని కెరీర్‌లో ఒక సినిమా ఆడియో హక్కులకు ఇంత పెద్ద మొత్తం రావడం ఇదే మొదటిసారని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా విడుదల కాకముందే ఆడియో హక్కులు ఇంత పెద్ద మొత్తానికి అమ్ముడుపోవడం చిత్ర యూనిట్‌కు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్రం తెలుగుతో పాటు- హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది (2026) మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగిన కొన్ని నిజమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు- సమాచారం. ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతోంది.



# నా కథ సినిమాగా వస్తూ చూడాలని ఉంది: భజ్జీ

భారత క్రికెట్ చరిత్రలో అత్యంత గొప్ప బౌలర్లలో హర్భజన్ సింగ్ ఒకరు. తన స్పిన్ బౌలింగ్‌తో పాటు-, కీలక సమయాల్లో బ్యాటింగ్‌తోనూ ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాడు. 'టర్బనేటర్'గా పిలువబడే హర్భజన్ క్రికెట్ కెరియర్ సినిమాటిక్ గా ఉంటుందని దాన్ని వెండితెరపై చూపిస్తే వర్కవుట్ అవుతుందని కొందరి ఒపీనియన్. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో భజ్జీ తన జీవిత కథ సినిమాగా వస్తే చూడాలని ఉందన్నాడు. అంతేకాకుండా తన రోల్ కు పాత్రకు న్యాయం చేయాలని భావిస్తున్న ఇద్దరు హీరోల పేర్లను వెల్లడించాడు.అందుల్లో ఒకరు విక్కీ కౌశల్ మరొకరు రణవీర్ సింగ్. తన పాత్రకు వీరైతేనే బాగుంటుందని చెబుతున్నాడు. ఇప్పటికే కపిల్ బయోపిక్ 83లో రణ్ వీర్ సింగ్ కపిల్ దేవ్ గా కనిపించాడు. బహుశా ఇదే రన్వీర్ తన పాత్ర కూడా చేస్తే బాగుంటుందని భజ్జీ భావిస్తున్నాడేమో. గతంలో రణవీర్ సింగ్ '83' చిత్రంలో కపిల్ దేవ్ పాత్రలో ఒదిగిపోయి, ఆ పాత్రను ఎంత అద్భుతంగా పోషించగలడో నిరూపించుకున్నాడు. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయం సాధించకపోయినా, రణవీర్ నటనకు మాత్రం ప్రశంసలు దక్కాయి. మరోవైపు, విక్కీ కౌశల్ 'ఛావా' చిత్రంలో తన పాత్రలో సీరియస్ నెస్ ను చూపించాడు.బాక్సాఫీస్ వద్ద రూ. 600 కోట్లకు పైగా వసూలు చేసాడు. హర్భజన్ సింగ్ బయోపిక్‌లో తన పాత్రను ఎవరు పోషిస్తారో, ఆ చిత్రం ఎలా రూపుదిద్దుకుంటు-ందో చూడాలి. విక్కీ కౌశల్ తన ఇంటెన్సిటీతో కాని రణవీర్ సింగ్ తన ఎనర్జీతో భజ్జీ పాత్రలో మెప్పిస్తారో లేరో చూడాలి.



# తమిళనాట పెద్ద హిట్ కొట్టిన టూరిస్ట్ ఫ్యామిలీ

ఈ మధ్య తమిళంలో పెద్ద సినిమాలకంటే చిన్న సినిమాలే తమ హోవా చూపిస్తున్నాయి. ఈ ఏడాదిలో వచ్చిన లబ్బర్ పందు, మెయ్యాళగన్, కుడుంబస్తాన్, డ్రాగన్ చిత్రాలు సూపర్ హిట్‌లు అందుకున్నాయి. అయితే ఇదే కోవలో చిన్న సినిమాగా వచ్చి సూపర్ హిట్‌గా నిలిచింది టూరిస్ట్ ఫ్యామిలీ. తమిళ నటులు శశికుమార్, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో నటించగా.. యోగి బాబు, మిథున్ జై శంకర్, కమలేష్ జెగన్, ఎం.ఎస్. భాస్కర్, రమేష్ తిలక్, భగవతి పెరుమాళ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. అభిషన్ జీవింత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను అందుకుంది. ముఖ్యంగా ఈ సినిమా చూసిన ప్రేక్షకులు చాలా బాగుందని ప్రశంసిస్తున్నారు. తలైవర్ రజనీకాంత్‌తో పాటు- నటు-డు శివకార్తికేయన్ కూడా ఈ సినిమా చూసి చిత్రబృందంని ప్రత్యేకంగా పిలిపించుకుని అభినందించారు. ఇదిలావుంటే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. కేవలం రూ.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ.55 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. మరోవైపు తక్కువ బడ్జెట్‌తో రూపొందినప్పటికీ, 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రాలలో ఇది ఒకటిగా నిలిచింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. శ్రీలంకలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం కారణంగా ఒక తమిళ కుటు-ంబం తమ స్వస్థలాన్ని విడిచిపెట్టి భారతదేశానికి శరణార్థులు(సు÷బిషగు)గా వస్తారు. అనంతరం వారు చెన్నైలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ప్రయత్నిస్తారు. కానీ వాళ్లు ఎవరు అనేది చెప్పకుండా దాచిపెట్టాల్సి వస్తుంది. అలా దాచిపెడుతూ ఉండగా అనుకోకుండా రామేశ్వరం దగ్గర ఒక బాంబ్ బ్లాస్ట్ సంఘటన జరుగుతుంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేయడం మొదలుపెడతారు. అయితే ఈ కేసుకి వీరికి సంబంధమేంటి.. శ్రీలంక నుంచి వచ్చిన ఈ ఫ్యామిలీకి ఎదురైన సమస్యలేమిటి అనేది ఈ సినిమా కథ.

# దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో ఎన్టీఆర్?

తాజా సమాచారం ప్రకారం సినీ పితామహుడిగా పరిశ్రమ కొనియాడే దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ లో నటించేందుకు తారక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం నడుస్తుంది. ఈ ప్రాజెక్టు వెనుక రాజమౌళి, కార్తికేయ, వరుణ్ గుప్తా ప్రమేయం కూడా ఉందని టాక్. అంతే కాదు.. ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధం కాగా, అది విన్న జూనియర్ ఎన్టీఆర్ చాలా ఎగ్జైట్ అయి ఓకే చేశారట. అయితే భారతీయ చలన చిత్ర పరిశ్రమ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రెండేళ్ల కిందటనే 'మేడ్ ఇన్ ఇండియా' అనే సినిమా అనౌన్స్ చేయగా, దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో నితిన్ కక్కర్ మూవీని తెరకెక్కించబోతున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, త్వరలో వెల్లడిస్తామని అప్పుడు చెప్పగా, ఆ తర్వాత దాని నోరు విప్పింది లేదు. కాని ఇప్పుడు ఉన్నట్టుండి ఇందులో ఎన్టీఆర్ నటిస్తారని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. దాదాసాహెబ్ ఫాల్కే జీవితం చాలా పెద్దది. అలాంటి కథలను కచ్చితంగా ఇప్పటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. అందుకే జూనియర్ ఎన్టీఆర్ లాంటి నటు-డు అయితేనే ఈ ప్రాజెక్ట్ భాగా చేయగలరు. మరి ఇండియన్ సినిమా పుట్టుక, పెరుగుదలను తెలియజేస్తూ.. సినిమాలకి బీజం ఎక్కడ పడింది, ఎదిగే క్రమంలో ఎలాంటి ఒడిదుడుకులు ఎదుర్కోవలసి వచ్చింది అనేది చిత్రంలో చూపించనున్నారట.

